

వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కరీంనగర్ : fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-11-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 285 పేజీలు: 8+16 వెల: 8.00

అందుబాటు ధరల్లో కేన్సర్ మందులు: నడ్డా

5

అమెరికాలో నిలిచిన 11వేల విమానాలు

విలక్షణ నటుడు గిరిబాబు కన్నుమూత

అస్వస్థతతో చికిత్స పొందుతూ మృతి

ఐదు దశాబ్దాలుగా వెండితెరపై విభిన్న పాత్రలతో అలరించిన నటుడు

సినీ ప్రస్థానంలో 600 పైగా చిత్రాలు

నిర్మాత, దర్శకుడిగా కూడా తనదైన ముద్ర



హైదరాబాద్,నవంబరు 14, ప్రభాతవార్త: తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సినీనటుడు, దర్శకుడు, నిర్మాత >>2

పాలిటిక్నిక్‌లపై ప్రభుత్వం వెనక్కి

జిఒ 97ను సవరిస్తూ కొత్త జిఒ విడుదల



హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: కార్మికశాఖ పరిధిలోకి పాలిటెక్నిక్ కళాశాలల విలీనంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ మేరకు వివాదస్పద జీవో 97ను సవరిస్తూ జీవో 157ను జారీ చేసింది. పాలిటెక్నిక్‌లతోపాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఉన్నత విద్యాశాఖ పరిధిలో ఉంటాయని ఉత్తర్వులు ఇచ్చింది.ఐటీఐలు, ఏటీసీలు మాత్రం కార్మిక శాఖ పరిధిలోనే కొనసాగుతాయని, కానీ కరికులమ్ మాత్రం స్కిల్ యూనివర్సిటీ నియంత్రణలో ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. అకడమిక్ కార్యక్రమాలను విస్తరించడం >>2

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం అత్యవసర లాండింగ్

3



శనివారం హైదరాబాద్‌లో గిగ్ చట్టం అమలు సందర్భంగా వర్కర్లకు గుర్తింపు పత్రాలు అందజేస్తున్న రాహుల్. చిత్రంలో సిఎం, మంత్రులు

గిగ్ వర్కర్ల భద్రతకు చట్టం

వారి సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు

నెహ్రూ జయంతి సందర్భంగా రాహుల్ గాంధీ చేతుల మీదుగా చట్టం అమలుకు శ్రీకారం

నిఖిల్ డే సహకారంతో రూపకల్పన

రూ. 50 లక్షల జీవిత బీమా, రూ. 10 లక్షల ఆరోగ్య బీమా: సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబరు 14,ప్రభాతవార్త: నాటి నుంచి నేటి వరకు దేశ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో గాంధీ కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం, భద్రత కోసం భారత ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలోకి తీసుకొచ్చిందని వెల్లడించారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక గిగ్ వర్కర్ల చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. నవంబర్ 14న మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా రాహుల్ గాంధీ చేతుల మీదుగా ఈ చట్టం అమలుకు శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో జయభేరి గ్రౌండ్‌లో జరిగిన గిగ్ వర్కర్స్ సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ >>2

గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం

వారికి వైఫైతో ప్రత్యేక రెస్టుజోన్‌లు: రాహుల్ గాంధీ

గిగ్ వర్కర్ల ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత

హైదరాబాద్, నవంబరు 14,ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రతి గిగ్ వర్కర్‌కు రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ. 10 లక్షల ఆరోగ్య బీమా గ్యారెంటీగా అందిస్తున్నామనీ కాంగ్రెస్‌పార్టీ మీకు అండగా ఉంటుందనీ మీ సంక్షేమం కోసం ఇచ్చిన హామి నెరవేర్చుతున్నామని ఎఐసిసి అగ్రనేత,లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. శనివారం శిల్పకళా వేదిక నుంచి బయలుదేరిన గిగ్ వర్కర్‌ల ర్యాలీలో టిజి07ఎఫ్7162 రిజిస్టర్ నెంబర్ కలిగిన లలిత అనే పింకబ్‌బైక్ ర్యాపిడో ద్విచక్రవాహనంఎక్కి లోక్‌సభ ప్రతిపక్షనేత >>2



రాష్ట్ర కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జిగా బిఎం సందీప్

హైదరాబాద్, నవంబరు14, ప్రభాతవార్త: రాష్ట్ర కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జి నియామకంపై నెలకొన్న ఉత్కంఠకు ఎఐసిసి తెరదించింది. ఇన్‌ఛార్జిగా బిఎం సందీప్‌ను >>2



శనివారం బైక్‌ర్యాలీలో రాహుల్, రేవంత్

సమాఖ్య స్ఫూర్తికి కేంద్రం తూట్లు

నిధుల కోత, బిల్లుల తిరస్కృతితో రాష్ట్రాల హక్కులకు విఘాతం

డీలిమిటేషన్‌తో దక్షిణాదికి గండి

భారత్ సమ్మిట్‌లో మంత్రి ఉత్తమ్



శనివారం భారత్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్ నవంబరు 14,ప్రభాతవార్త: దేశ రాజ్యాంగ మౌళిక స్వరూపమైన సమాఖ్య విధానాన్ని కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని పలువురు నేతలు, మేధావులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిధుల కేటాయింపులో వివక్ష, గవర్నర్ల ద్వారా రాష్ట్ర బిల్లుల తొక్కివేత, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వంటి చర్యలు రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి పెను ప్రమాదంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ సమ్మిట్‌లో శనివారం తెలంగాణ అభ్యుదయం సహకార సమాఖ్య పాలనఅనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో వక్తలు కేంద్రం అనుసరిస్తున్న విధానంపై ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ సమన్వయకర్త గా వ్యవహరించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ >>2



శనివారం భారత్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

మోడీ ప్రధాని అయ్యాక అదానీ వ్యాపారం బాగా పెరిగింది

14 కోట్ల మంది ఓటర్లను తొలగిస్తే అవి ఎన్నికలా?

భారత్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ

ఫాసిస్టులకు చోటులేదు..

వారివల్ల పదేళ్లుగా వ్యవస్థలు ధ్వంసం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు14: రాజకీయాల్లో ఫాసిస్టులకు చోటు లేదని లోభలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. శనివారం హెచ్ఐసిసిలో భారత్ సమిట్ ముగింపు సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. గత పదేళ్లుగా ఫాసిస్టుల గొంతు గట్టిగా వినిపిస్తోందని, వారి వల్ల వ్యవస్థలు ధ్వంసం అవుతున్నాయని ధ్వజమెత్తారు. "2014లో జరిగిన ఎన్నికలు గతంలో ఎప్పుడూ చూడలేదు. అంతకు ముందు జరిగిన ఎన్నికలకంటే పూర్తిగా భిన్నమైనవి, రూ. వందల కోట్లు ఖర్చు చేశారు. అది దేశ రాజకీయ ముఖ చిత్రాన్నే పూర్తిగా మార్చేసింది. 2014 ఎన్నికల్లో భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ధ్వంసమైంది. దేశంలో విపరీతమైన నగదు ప్రవాహం(లిక్విడిటీ) కారణంగా రాజకీయ వ్యవస్థ మొత్తం భ్రష్టు పట్టిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. '2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయి. 14 కోట్ల మంది ఓటర్లు కాదని ఎన్నికల సంఘం పేర్కొంది, అంత పెద్ద మొత్తంలో ఓట్లు తొలగించి ఎన్నికలు జరిపితే వాటిని అసలు ఎన్నికలు అని ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు. 'మహారాష్ట్రలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో యూపీఏ కూటమి ఎక్కువ సీట్లు గెలిచింది. ఆ తర్వాత 3 నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఆ ఎన్నికల్లోనూ అనేక అవకతవకలకు పాల్పడ్డారు. 3 నెలల వ్యవధిలో 70 లక్షలకు పైగా ఓట్లు నమోదు చేశారు. అదనంగా చేర్చిన ఓట్ల ద్వారానే భాజపా గెలిచింది. వ్యవస్థలు నాశనం అవుతున్నా మనం ప్రజాస్వామ్యం అని గొప్పగా చెప్పుకొంటున్నాం' అని పేర్కొన్నారు. 'రాజకీయాలంటే గట్టిగా మాట్లాడటం, ఘాటైన విమర్శలు చేయడం కాదు' అని స్పష్టం చేశారు. హైదరాబాద్, బెంగళూరులో ఐటీ రంగం బాగా అభివృద్ధి చెందింది. >>2



వణికిస్తున్న చలిగాలులు

7

కోహీర్‌లో అత్యల్పంగా 11° నమోదు



శనివారం హైదరాబాద్‌లో రాంచందర్‌రావును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

అక్రమ హౌస్ అరెస్టులతో బిజెపిని ఆపలేరు

రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదు!

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు హౌస్ అరెస్ట్

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: హైదరాబాద్‌లో కాంగ్రెస్‌పార్టీ నిర్వహిస్తున్న 'యాంటీ భారత్ సమ్మిట్'కు, రాహుల్ గాంధీ పర్యటనకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, తనను, రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలను పోలీసులు అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయడాన్ని బీజేపీ తెలంగాణ రాష్ట్ర >>2

అసలైన నియంతృత్వ పార్టీ కాంగ్రెస్సే

విదేశీ శక్తుల ముందు దేశ ప్రతిష్టను దిగజార్చుతున్నారు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం



శనివారం హైదరాబాద్‌లో మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'భారత్ సమ్మిట్'పై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఫాసిస్ట్ ప్రభుత్వం అని విమర్శించిన రాహుల్ గాంధీపై నిప్పులు చెరిగారు. దేశ చరిత్రలో అసలైన ఫాసిస్ట్, నియంతృత్వ పార్టీ కాంగ్రెస్సేనని, 18 నెలల ఎమర్జెన్సీ కాలంలో పత్రికా స్వేచ్ఛను కాలరాసి, ప్రజల ప్రాథమిక హక్కులను అణచివేసి, జయప్రకాష్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ, జార్జ్ ఫెర్నాండెజ్ వంటి లక్షలాది మందిని చీకటి జైళ్లలో బంధించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణకు పెట్టుబడులు వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతుండటంపై కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.ఒకవైపు రాహుల్ గాంధీ వేదికపై నిలబడి భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది, ఎన్నికలు ఫ్రాడ్, దేశం ఫాసిస్టుల చేతిలో ఉంది అని విదేశీయుల ముందు ఉపన్యాసాలు ఇస్తుంటే.. ఫాసిస్టుల పాలనలో ఉన్న దేశానికి విదేశీ పెట్టుబడులు ఎలా వస్తాయో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఇస్తున్న ప్రకటనలకు, సదస్సుకు పిలిచిన వ్యక్తులకు, రాహుల్ ప్రసంగాలకు కనీసం ఒక్కశాతం కూడా సంబంధం >>2

బిజెపిని ఆపలేరు

>> అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. శనివారం ఉదయం 6 గంటల నుంచే పోలీసులు తన నివాసం వద్ద భారీగా మోహరించి బయటకు వెళ్లకుండా గృహనిర్బంధంలో ఉంచడంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో రాహుల్ గాంధీ హాజరవుతున్న భారత్ సమ్మిట్ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చే సదస్సు ఎంతమాత్రం కాదని, ఇది కేవలం భారతదేశ అంతర్గత రాజకీయ పరిస్థితులపై విదేశీయులను పిలిపించి చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ పెట్టిన కార్యక్రమమని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర కష్టాల్లో ఉన్నా పట్టించుకోని తెలంగాణ ప్రభుత్వం, ప్రజల సొమ్మును వెచ్చించి ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేయడం దారుణమన్నారు. భారతదేశంపై, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ప్రపంచానికి తప్పుడు సమాచారం ఇచ్చి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఈ సదస్సు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ సదస్సుకు విదేశాల నుంచి వచ్చిన వారిలో సగానికి పైగా గతంలో భారతదేశ వ్యతిరేక వైఖరిని ప్రదర్శించిన వారే ఉన్నారని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. భారతదేశానికి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఐదు వ్యాసాలు రాసిన నార్వే జర్నలిస్టు హెల్లె లింగ్ వీసాను 10 నిమిషాల ముందు రద్దు చేశారంటూ ఆమె ట్విట్టర్‌లో పోస్ట్ చేశారని ప్రస్తావిస్తూ.. దేశ వ్యతిరేక రాతలు రాసే వారిని ఈ సదస్సుకు ఎందుకు ఆహ్వానించారని ప్రశ్నించారు. గతంలో రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి భారతదేశ ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమీ అంటూ అవమానించారని, ఇప్పుడు ఏకంగా విదేశీయులను మన గడ్డపైకి తీసుకొచ్చి భారతదేశంపై విషం చిమ్మించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మన దేశ ప్రజాస్వామ్యంలో అంతర్గత రాజకీయ అంశాలపై మనమందరం చర్చించుకోవచ్చు, విమర్శించుకోవచ్చు కానీ, విదేశీ శక్తులను తీసుకొచ్చి దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఈ సదస్సును స్పాన్సర్ చేస్తున్న ప్రోగ్రెసివ్ అలయన్స్ సంస్థ గతంలో బంగ్లాదేశ్, నేపాల్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో విద్యార్థుల సమ్మెలు, ఆందోళనలను ప్రేరేపించి, అక్కడ ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కూల్చివేసేలా రెజీమ్ చేంజ్ కుట్రలకు పాల్పడిందని ఆరోపించారు. అలాంటి ప్రమాదకర సంస్థతో కలిసి రాహుల్ గాంధీ సమావేశం నిర్వహించడాన్ని బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తోందని, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువస్తే తమకు అభ్యంతరం లేదని, కానీ భారత వ్యతిరేక వాణిని వినిపిస్తే మాత్రం అడ్డుకుని తీరుతామని తేల్చిచెప్పారు.మరోవైపు, మూడు సంవత్సరాల క్రితం అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చిన రాహుల్ గాంధీ.. రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు ఆరు గ్యారెంటీల పేరుతో ఎన్నో హామీలిచ్చి వెళ్లారని రాంచందర్ రావు గుర్తు చేశారు. నేడు రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, జాబ్ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ జాడే లేదని, రైతులకు రైతుబంధు, రైతుభరోసా అందడం లేదని విమర్శించారు. ఏ ఒక్క రంగంలోనూ ఇచ్చిన వాగ్దానాలను, గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను నిలువునా మోసం చేసిన రాహుల్ గాంధీకి తెలంగాణ గడ్డపై అడుగుపెట్టే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. ఈ ప్రధాన కారణాలతోనే రాహుల్ గాంధీ పర్యటనను, యాంటీ భారత్ సమ్మిట్‌ను బీజేపీ వ్యతిరేకిస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీజేపీ, యువమోర్చా కార్యకర్తలు నల్లజెండాలతో నిరసనలు తెలుపుతూ భారతదేశ అస్తిత్వాన్ని, స్వాభిమానాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భారతదేశాన్ని అవమానించేందుకే పెట్టిన ఈ యాంటీభారత్ సమ్మిట్‌పై గొంతెత్తినందుకే తనను, పార్టీ కార్యకర్తలను హౌస్ అరెస్ట్ చేశారని, ప్రభుత్వ నిర్బంధాలకు భయపడే ప్రసక్తే లేదని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

నియంతృత్వ పార్టీ కాంగ్రెస్సే

>> లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకు బహుళజాతి కంపెనీలు, డేటా సెంటర్లు, పెట్టుబడులు వస్తున్నాయంటే అది రేవంత్ రెడ్డినో, డి.కె. శివకుమార్‌నో, రాహుల్ గాంధీనో చూసి కాదని.. గుజరాత్ సీఎంగా నరేంద్ర మోదీ ప్రారంభించిన ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ స్ఫూర్తి, నేడు కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వ సుపరిపాలన, అనుకూల వాతావరణం వల్లేనని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రజల పన్నుల సొమ్మును దుర్వినియోగం చేసి, విదేశీయులకు ఫస్ట్ క్లాస్ విమాన టికెట్లు ఇచ్చి, స్టార్ హోటళ్లలో పెట్టి మేపి నిర్వహించిన ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి ఒరిగిందేంటో రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్ వేదికగా జరిగింది భారత్ సమ్మిట్ కాదని, అది ముమ్మాటికీ భారత వ్యతిరేక సమ్మిట్ అని కిషన్ రెడ్డి ఆరోపించారు. భారతదేశం మీద, ప్రధాని మోదీ గారి మీద విషం చిమ్మే విదేశీ శక్తులను, జేఎన్‌యూలో తుక్డే తుక్డే గ్యాంగ్‌లకు మద్దతు ఇచ్చే వారిని హైదరాబాద్‌కు పిలిపించి ప్రపంచం ముందు దేశ పరువు తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 ఎన్నికల్లో ఓడిపోయి డిఫీట్ సెంచరీ కొట్టిన రాహుల్ గాంధీ.. పిట్టల దొరలాగా మాట్లాడుతూ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికలు, మహారాష్ట్ర ఎన్నికలన్నీ ఫ్రాడ్ అని ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. 12 ఏళ్లుగా మోదీ గారి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఎందుకు రావడం లేదని ఆశ్చర్యపోతూ.. ఈవీఎంలు, ఎన్నికల కమిషన్, హైకోర్టు, సుప్రీంకోర్టు, భారత సైన్యం, లోక్‌సభ, రాజ్యసభ, చివరకు దేశ భద్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జాతీయ భద్రతా సలహాదారుపై కూడా విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ హయాంలోనూ ఎన్ఎస్ఏగా పనిచేసిన అధికారి అప్పుడు మంచివాడిగా కనిపించి, మోదీ ప్రభుత్వంలో దేశ శాంతి కోసం, ఉగ్రవాద అణచివేత కోసం పనిచేస్తుంటే ఇప్పుడు కుట్రదారుడిగా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. దేశ అంతర్గత భద్రత విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని కిషన్ రెడ్డి ఎండగట్టారు.గతంలో ఉగ్రవాదులు, తీవ్రవాదులు, నక్సలైట్లతో అంటకాగిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని.. ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్ శ్రీపాదరావు, సీనియర్ నేతలు హయగ్రీవాచారి, నర్సిరెడ్డి, ఐపీఎస్ అధికారి వ్యాస్ వంటి ఎందరినో నక్సలైట్లు పొట్టనపెట్టుకున్న విషయాన్ని రేవంత్ రెడ్డి మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఒకేసారి 74 మంది జవాన్లను నక్సలైట్లు పొట్టనపెట్టుకుంటే కనీసం సంతాపం కూడా తెలపకుండా, తుపాకీ రాజ్యం కావాలనే వారికి లిప్ సింపతీ చూపిన చరిత్ర రాహుల్ గాంధీదని విమర్శించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా దేశంలో మతకలహాలు, బాంబుపేలుళ్లు, వేర్పాటువాదం, రాళ్ల దాడులు లేకుండా ఉగ్రవాదాన్ని అణచివేశామని స్పష్టం చేశారు.



శనివారం హైదరాబాద్‌లో చిరంజీవితో భేటీ అయిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఫాసిస్టులకు చోటులేదు..

>> 12 ఏళ్ల క్రితం 600వ స్థానంలో ఉన్న ఆదానీ ఇప్పుడు ఎక్కడున్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక సంపన్నుల జాబితాలో ఆదానీ రెండో స్థానంలోకి వచ్చారు. ఏ రంగంలో చూసినా అదానీ పెట్టుబడులే కనిపి స్తాయి. మోదీ ప్రధానిగా వచ్చాక ఆయన వ్యాపారం బాగా పెరిగింది. పోర్టులు, విమానాశ్రయాలు, మౌలిక వసతులు.. అదానికి అప్పగించారు. లబ్ధి పొందిన వ్యాపారులు వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు" అని రాహుల్ విమర్శించారు.

వ్యవస్థలు సహకరించకపోయినా తాము నిరాశ చెందకుండా నేరుగా ప్రజల్లోకి వెళ్లగలిగామని రాహుల్ తెలిపారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సాగిన భారత్ జోడో పాదయాత్ర ద్వారా కోట్లాది మంది ప్రజలను నేరుగా కలుసుకున్నామని, ఆ ప్రయాణంలో మమ్మల్ని మేము మరింతగా తెలుసుకోగలిగామని చెప్పారు. కేంద్రంలో ఉండే పెద్దలు ప్రజల సమస్యలు వినడం లేదని రాహుల్ ఆరోపించారు.

తాము చేపట్టిన పాదయాత్రలో అనేక ఫిర్యాదులు వచ్చాయని గుర్తు చేశారు. స్వాతంత్రం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం దిశగా కాంగ్రెస్ పోరాటం చేసిందన్నారు. కొందరిని కొంతకాలమే మోసం చేయగలరని, అందరినీ ఎల్లకాలం మోసం చేయలేరని కెన్నడీ చెప్పారన్నారు. అబద్ధాలతో ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారని ప్రశ్నించారు. సత్యం, అహింస అనేవి బలమైన ఆయుధాలని, హింస, విద్వేషం, ఘర్షణ వాతావరణంలో అభివృద్ధి చెందలేమని స్పష్టం చేశారు.

విద్వేషం, అహింసతో వాళ్లను ఓడించలేమని, తమ మనస్తత్వం అలాంటిది కాదని పేర్కొన్నారు. రాజకీయాల్లో హింస, ద్వేషం, కోపం ఎన్నటికీ పనిచేయవని.. కేవలం ప్రేమ, అభిమానం, అహింస, సత్యం మాత్రమే ఎప్పటికీ గెలుస్తాయని ఆయన స్పష్టం చేశారు. తమ సిద్ధాంతాలకు కట్టుబడి, సత్యం, అహింసా మార్గంలోనే తమ పోరాటం కొనసాగుతుందని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు.

వారం - వర్ఖం

15-11-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, విశాఖ కార్తె,
తి.షష్ఠి రా.2.00, న. ఉత్తరాషాఢ రా.11.27
వ.రా.3.55 - తె.5.42
దు. మ.3.58 - సా.4.43
రాహు సా.4.30-సా.6.00
శుభ న. లేదు.

వారాఫలం

మేషం : జీవిత భాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. కొత్త పెట్టుబడులు అనుకూలంగా ఉంటాయి. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

వృషభం : ఉద్యోగాలలో హోదాలు లభిస్తాయి. రాజకీయ రంగాల వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి.

మిథునం : సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. కార్యాలయంలో ప్రతికూల వాతావరణం నెలకొంటుంది. ప్రముఖుల కలయిక.

కర్కాటకం : సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ చాలా అవసరం కనబడుతుంది. సన్నిహితుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

సింహం : వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా ధైర్యంతో ముందుకు సాగుతారు. ఆర్థిక పరిస్థితి సానుకూలంగా ఉంటుంది.

కన్య : భూముల క్రయ విక్రయాలలో ఆచితూచి వ్యవహరిస్తారు. సంబంధ బాంధవ్యాలు మెరుగుపడతాయి. వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

తుల : దూరప్రాంతాన నుండి కీలక సమాచారం అందుకుంటారు. స్థిరాస్థి వివాదాలు తీరుతాయి. ఆరోగ్యంపట్ల మెలకువ అవసరం.

వృశ్చికం : సూతన వ్యక్తులు పరిచయమై మాటసహాయం చేస్తారు. విలాస జీవితం సాగిస్తారు. పాత బాకీలు వసూలవుతాయి.

ధనుస్సు : ఎంతటి వారినైనా మాటల చాతుర్యంతో ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

మకరం : సాంకేతిక పరిశోధన విషయాలపై దృష్టి సారిస్తారు. సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

కుంభం : బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. అందరిలోనూ ప్రత్యేకాకర్షణగా నిలుస్తారు. సమస్యల నుండి బయట పడతారు.

మీనం : భూములకు సంబంధించిన వివాదాలు పరిష్కారదశకు చేరుకంటాయి. రాజకీయ రంగాల వారికి విదేశీ పర్యటనలు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్

గిగ్ వర్కర్ల భద్రతకు చట్టం

>>మహేష్ కుమార్ గౌడ్, ఇతర మంత్రులు, ప్రజాప్రతి నిధుల సభలో సీఎం ప్రసంగించారు. 2023లో కన్యాకు మారి నుంచి కశ్మీర్ వరకు సుమారు 4 వేల కి.మీ మేర రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మందుబెండలు, మంచుకొండలను లెక్కచేయకుండా గ్రామాలు, గూడేలు, తండాలు, మారుమూల ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమయ్యారని గుర్తు చేశారు. ఈ యాత్రలో కేవలం రాజకీయ అంశాలకే పరిమితం కాకుండా పేదలు, కార్మికులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని చెప్పారు. వారి కష్టాలను వింటూ, వారి హక్కుల కోసం గొంతుకగా నిలిచారని వివరించారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ఆనాడు హైదరాబాద్‌కు వచ్చినప్పుడు గిగ్ వర్కర్లు రాహుల్ గాంధీని కలిసి తమ సమస్యలను వివరించారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రోజంతా కష్టపడుతున్నప్పటికీ వారికి సరైన ఆదాయ భద్రత లేదని, ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలకు అండగా నిలిచే



శనివారం హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల సభలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, సిఎం రేవంత్

వ్యవస్థ లేదని, తమ హక్కులకు చట్టబద్ధమైన గుర్తింపు కావాలని కోరారని తెలిపారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిగ్ వర్కర్ల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆ హామీని ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చిందని స్పష్టం చేశారు.

గిగ్ వర్కర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆరోగ్యపరమైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి గిగ్ వర్కర్‌కు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించామని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు ఆరోగ్య బీమా అందించే ఏర్పాటు చేశామని వివరించారు. ప్రమాదాలు, అనారోగ్య సమస్యల సమయంలో కార్మికులతోపాటు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమన్నారు. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి, వారికి గుర్తింపు కార్డులు, ప్రత్యేక గుర్తింపు నంబర్లు అందించే విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఇప్పటివరకు అసంఘటిత రంగంలో పనిచేస్తూ అనేక సమస్యలు ఎదుర్కొంటున్న కార్మికులకు ఈ చట్టం ద్వారా ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. వారి హక్కులు, సంక్షేమం, ఆదాయ భద్రతకు అవసరమైన వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. గిగ్ వర్కర్లకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం ఒక బాధ్యతగా తీసుకుందని రేవంత్‌రెడ్డి వివరించారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే దానిని నిలబెట్టుకుంటుందని, ఆ కుటుంబ వారసుడిగా రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని ఆయన సమక్షంలోనే అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. గిగ్ వర్కర్ల సమస్యలను గుర్తించి, వారి హక్కుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావడానికి ఆయన అందించిన ప్రోత్సాహం మరువలేనిదని చెప్పారు. ఈ చట్టం రూపకల్పన, అమలు ప్రక్రియలో నిఖిల్ డే తదితరులు ఎంతో సహకారం అందించారని ముఖ్యమంత్రి తెలిపారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు ఆశించకుండా వారు అందించిన సహకారం అభినందనీయమన్నారు. గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

గిగ్ వర్కర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చిన ప్రభుత్వం.. ఇకపై కూడా వారి సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం ద్వారా కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గిగ్ వర్కర్ల తరఫున రాహుల్ గాంధీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం

>> రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. జయభేరి గ్రౌండ్‌లో నిర్వహించిన గిగ్‌వర్కర్ల సభకు ముఖ్య అతిథిగా రాహుల్‌గాంధీ హాజరై గిగ్ వర్కర్ల హక్కుల సాధనకు ఎప్పుడూ ముందు వరసలో ఉండి పోరాడుతామని ధీమా వ్యక్తంచేశారు. కేంద్రంలోని మోడీ సర్కార్ ,ఆర్ఎస్ఎస్ గిగ్ వర్కర్‌లను వెట్టి చాకిరి కార్మికులుగా మిమ్మల్ని అణిచివేయడానికి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. బానిసలుగా చేసి మిమ్మల్ని దోచి అణిచివేయాలని చూస్తే సహించేదిలేదని మిమ్మల్ని సేవకులుగా కాదు అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దుతామని హామి ఇచ్చారు.కేంద్ర ప్రభుత్వ విధానాలు కంపెనీ యజమానులకు లాభాలు వచ్చేలా ఉన్నాయని కార్మికుల జీవితాలపై ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.గతంలో తెలంగాణ గిగ్ వర్కర్లతో జరిగిన సమావేశంలో వారి సమస్యలను విన్నాననీ ఆరోజు గిగ్ వర్కర్లకు రక్షణ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నామనీ చెప్పారు. గిగ్ వర్కర్లు తాము ఎంత పనిచేశామో ఎంత ఫలితం అందుకొంటున్నామో తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని అప్పుడే శ్రమదోపిడికి గురికాకుండా వారు చేసిన కష్టార్జితం న్యాయంగా అందుతోందని అన్నారు. 21వ శతాబ్దం డేటా యుగం, గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఉబెర్ వంటి సంస్థలన్నీ డేటా ఆధారంగానే నడుస్తున్నాయి ఇప్పటివరకు దేశంలో గిగ్ వర్కర్లకు తమ సొంత పని డేటాను చూసుకునే అవకాశం కూడా ఉండేది కాదు. వర్కర్లు చేసిన డెలివరీలు, పట్టిన సమయం, వచ్చిన డబ్బుకు సంబంధించిన పూర్తి సమాచారం వారికి అందేది కాదు. కష్టం మీది, డేటా మీది అయినప్పుడు ఆ డేటాపై మీకే పూర్తి హక్కు ఉండాలి అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త చట్టం ద్వారా గిగ్ వర్కర్లకు తమ డేటాపై పూర్తి అధికారం లభిస్తుందనీ తెలిపారు. ప్రతి రైడ్, ప్రతి డెలివరీ, ప్రతి లావాదేవీకి సంబంధించిన పూర్తి సమాచారం ఇకపై వర్కర్లకు అందుబాటులో ఉంటుందనీ తెలిపారు. గిగ్ వర్కర్ల సమాచారం అంతా ఇకపై మీ మొబైల్ ఫోన్‌లోనే అందుబాటులో ఉంటుందనీ దీనితో మీ కష్టార్జితం మీకే న్యాయంగా దక్కుతుందని అన్నారు,ఎండలో రోజంతా స్కూటర్లపై డెలివరీలు చేసే మీకు నగరంలో విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక స్థలం లేదని వాపోయారు. హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని ప్రతి నగరంలో గిగ్ వర్కర్ల కోసం వైఫై సౌకర్యంతో కూడిన ప్రత్యేక రెస్ట్ జోన్లు ఏర్పాటు చేయబోతున్నామనీ తెలిపారు. రెస్ట్ జోన్లలో వాహనాలు పార్క్ చేసి విశ్రాంతి తీసుకోవడానికి, నిద్రపోవడానికి అవకాశం ఉంటుందనీ వివరించారుప్రమాదాలు జరిగినా, అనారోగ్యం పాలైనా పని చేయలేక మీ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయనీ అందుకే మీకు భవిష్యత్‌పై బెంగ ఉండకుండా సాధ్యమైనంత న్యాయం చేయడానికి ఒక మంచి విధివిధానంకూడా ఆలోచించి అమలు చేయడానికి పూనుకొంటామని ఇది దేశవ్యాప్తంగా అందరికి లాభం జరిగేలా ఉండాల్సి ఉందని అన్నారు .గిగ్ వర్కర్లకు కూడా పెన్షన్, సామాజిక భద్రత ఉండాలి.. మీ భవిష్యత్తు కోసం డబ్బు ఆదా కావాలనీ ఉబెర్ రైడ్ అయినా, బ్లింకిట్ డెలివరీ అయినా.. ప్రతి ట్రాన్సాక్షన్ నుంచి 1 డబ్బు నేరుగా మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందనీ తెలిపారు. ఆయా కంపెనీలు ప్రతి లావాదేవీపై ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందనీ చెప్పారు. ఇది గిగ్ వర్కర్ల బోర్డు ద్వారా నేరుగా మీ ఖాతాకు చేరుతుందనీ అన్నారు. సిఎం,డిప్యూటి సిఎం పాల్గొన్న ర్యాలీ శిల్పకళా వేదిక నుంచి గిగ్ వర్కర్స్ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క టిపిసిసిఅధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులుపాల్గొన్నారు. తెల్లని పువ్వులతో కూడిన ముదురు నీలం రంగు దుస్తులు ధరించిన ర్యాపిడో డ్రైవర్ లలిత వెనుక పిలియన్‌రైడర్‌గా రాహుల్‌గాంధీ కూర్చొని ప్రయాణించారు. లౌకికత్వం విద్వేషరహిత సమాజ స్థాపన అనే కాంగ్రెస్ సిద్ధాంతానికి ప్రతీకగా ఆయన రైడ్ నిలిచిపోయింది. సాధారణంగా నెవీబ్లూ,దానిపై తెలుపురంగు పుష్పాలు విద్వేషరహితమైన హుందాతనం గాంభీర్యం,అధికారం ఆర్థిక లబ్ధి వంటి స్వప్రయోజనాలను వాడుకోని స్వచ్ఛత ప్రశాంతత దైవభక్తి నిబద్ధతను సూచిస్తాయి,ఒవైపు మతం దైవభక్తిని విద్వేషంతో ఒట్లుగా మార్చుకొంటున్న రోజుల్లో ప్రేమశాంతిని మాత్రమే రాజకీయ అధికారంకు పమరార్థం అని రాహుల్‌గాంధీ తన రైడ్‌తో వెల్లండించారు.

రాష్ట్ర కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జిగా బిఎం సందీప్

>> నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణ ఇన్‌ఛార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన నేపథ్యంలో ఆమెస్థానంలో ఈ మార్పు జరిగింది. కొత్త ఇన్‌ఛార్జి రేసులో మొదట రాజస్థాన్ మాజీ సిఎం అశోక్ గెహ్లోత్, సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, మాణిక్ రావు ఠాక్రే తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. చివరకు అధిష్ఠానం బిఎం సందీప్‌కు బాధ్యతలు అప్పగించింది.

నటుడు గిరిబాబు కన్నుమూత

>> గిరిబాబు (80) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. వెండితెరపై హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హాస్యనటుడిగా ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రజల గుండెల్లో నిలిచిపోయిన గిరిబాబు మరణంతో సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది.ఈ విషయం తెలుసిన పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు సంతాపం తెలుపుతున్నారు.గిరిబాబుకు ఇద్దరు కుమారులు. వారిలో రఘుబాబు తెలుగు చిత్ర పరిశ్రమలో హాస్యనటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. గిరిబాబుకు కుమారులు రఘుబాబు, బోసుబాబు కూడా సినీ రంగంతో అనుబంధం కలిగి ఉన్నారు. సతీమణి 2016లో అనారోగ్యంతో కన్నుమూశారు. ఐదు దశాబ్దాలు తెలుగు ప్రేక్షకులను అలరించిన గిరిబాబు చివరిగా 2023లో విడుదలైన 'అన్నీ మంచి శకునములే' చిత్రంలో నటించారు. ఎన్నో తరాల హీరోలతో కలిసి నటించిన ఆయన, తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో వందలాది పాత్రలతో ప్రేక్షకులకు గుర్తుండిపోయారు. ఆయన మరణంతో తెలుగు చిత్ర పరిశ్రమ ఓ సీనియర్ నటుడిని కోల్పోయింది.

నటుడిగా సినీ ప్రస్థానం..

గిరిబాబు అసలు పేరు యెర్రా శేషగిరిరావు. 1946 జూన్ 8న ప్రకాశం జిల్లా రావినూతల గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే నాటకాలపై ఆసక్తి ఉండేది. సినిమాల్లో నటించాలనే కోరికతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 1970వ దశకంలో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు.1973లో 'జగమే మాయ' సినిమాతో నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. గిరిబాబు తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో 600లకు పైగా చిత్రాల్లో నటించారు. ప్రారంభంలో హీరోగా నటించాలని ఆశించినప్పటికీ, ఆ తర్వాత ప్రతినాయకుడి పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తనదైన నటన, డైలాగ్ డెలివరీతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. క్రమంగా విలన్ పాత్రలతో పాటు క్యారెక్టర్ ఆర్టిస్టుగా, హాస్యనటుడిగా కూడా రాణించారు. పలు తరాల అగ్రహీరోల సినిమాల్లో కీలక పాత్రలు పోషించారు. ఆయన నటించిన ముఖ్యమైన చిత్రాల్లో 'జగమే మాయ, కురుక్షేత్రం,కరుణామయుడు, దేవతలారా దీవించండి, సింహగర్జన, మెరుపుదాడి, కంచు కాగడా, సింహాసనం, అతడు, గమ్యం,డమరుకం, ఖడ్గం, గీత గోవిందం, శ్రీనివాస కళ్యాణం'.. ఇలా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ముఖ్యంగా ప్రతినాయకుడి పాత్రల్లో ఆయన నటన ప్రేక్షకులపై చెరగని ముద్ర వేసింది.

నిర్మాతగా, దర్శకుడిగా కూడా..

నటుడిగానే కాకుండా గిరిబాబు నిర్మాతగా, దర్శకుడిగా కూడా తన



విహెచ్ నివాసంలో జరిగిన పూజలో పాల్గొన్న భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, అనిల్‌కుమార్‌యాదవ్, బండారు దత్తాత్రేయ, అక్కర వేణుగోపాల్‌లు

విహెచ్ నివాసానికి డి.సిఎం భట్టి

హైదరాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త: ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపి వి.హనుమంతరావు నివాసంలో సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా జరిగింది. అంబర్‌పేటలోని తననివాసంలో నిర్వహించిన సత్యనారాయణ స్వామివ్రత పూజలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి భట్టి విక్రమార్క,మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, వద్దిరాజు రవీంద్ర,మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ,ప్రభుత్వసలహాదారు వేణు గోపాల్, పలువురు కాంగ్రెస్ నేతలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గ్రేహౌండ్స్‌లో షూటింగ్ వౌస్‌ను ప్రారంభించిన సందర్భంగా ఉన్న తాధికారులతో డిజిపి సి.వి.ఆనంద్

గ్రేహౌండ్స్‌లో షూటింగ్ వౌస్‌ను ప్రారంభించిన డిజిపి సి.వి.ఆనంద్

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: తెలంగాణ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలు దేశ పోలీసు వ్యవస్థకే ఆదర్శంగా నిలుస్తోందని డిజిపి సి.వి. ఆనంద్ అన్నారు. నక్సలిజం, ఉగ్రవాదం, వంటి ముప్పులను ఎదుర్కోవ డంలో రాష్ట్ర అంతర్గత భద్రతతోపాటు దేశ భద్రతలోనూ గ్రే హౌండ్స్, ఆక్టోపస్ దళాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. శివార్లలోని రాజేంద్రనగర్‌లో గల గ్రేహౌండ్స్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన షూటింగ్ వౌస్‌ను శనివారం నాడు డిజిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 దశకంలో నక్సల్స్ కార్యకలాపా లు, ఉగ్రవాద ముప్పు లను సమర్థంగా ఎదుర్కోవడంలో గ్రేహౌండ్స్ విశేష పాత్ర పోషించిందని గుర్తుచేశారు. ఇటీవల అక్టోబరు 31న గుజరాత్ లోని కెవాడియాలో నిర్వ హించిన జాతీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో తెలంగాణ గ్రేహౌండ్స్ ప్రదర్శించిన కవాతు అందరినీ ఆకట్టుకుందని, మ న్ననలు పొందిందని ఆయన తెలిపారు. గ్రేహౌండ్స్ సిబ్బంది మెరుగైన శిక్షణ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఆయన సూ చించారు. గ్రేహౌండ్స్ సిబ్బంది సంఖ్య కనీసం 700 మందికి తగ్గకుండా ఉంటుందని ఆయన అన్నారు. కర్రెగుట్టల ప్రాంతాల్లో సాధనతో పాటు అటవీ ప్రాంతాల్లో జంగిల్ ప్రాక్టీస్, వార్‌ఫేర్ శిక్షణను నిరంతరం కొనసాగించాలని ఆయన తెలిపారు. హైజాకింగ్, ఉగ్రవాద దాడులు,ఎలాంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొ నేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆయన వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రాజస్థాన్‌లోని జోధ్ పూర్‌లో జరగనున్న ఆల్ ఇండియా పోలీస్ కమాండో పోటీల్లో తెలంగాణ గ్రేహౌండ్స్ బృందం ప్రథమ బహుమతి సాధిం చాలని ఆయన ఆకాంక్షించారు. ఈసందర్భంగా శిక్షణ, షూటింగ్‌లో ప్రతిభ కనబరిచిన సిబ్బందినిఅభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రేహౌండ్స్, ఆక్టో పస్ విభాగాల అధిపతి అనిల్‌కుమార్, రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్, ఏఎస్పీ ఫాతిమా,గ్రూప్‌కమాండర్లు ఎండీ అష్ఫాక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఫార్మా కంపెనీలో అక్రమంగా నిల్వ ఉంచిన మసాల దినుసులు జప్తు

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు ఏ ర్పాటైన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) శనివారం సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌ల గల నియో సెల్ బయోటెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీపై దాడిచేసి అక్రమంగా నిలువ వుంచిన మూడు లక్షల 54 వేల రూపాయల విలువచేసే మసలా దినుసులను జప్తు చేసింది. ఈ ప్రాంతంలో వున్న కొన్ని ఫార్మా కంపెనీలు ఎలాంటి అనుమతులు, లైసెన్స్ లేకున్నా ఇష్టానుసారం భా రీగా ఆహార పదార్థాల తయారీలో వాడే మసాలా దినుసులను అక్రమంగా నిలువ వుంచుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఈ కంపెనీపై టిజి సేఫ్ దాడులు నిర్వహించింది. దాడుల సం దర్భంగా అక్రమంగా నిలువ వుంచిన ఎనిమిది రకాల మసాల దినుసులను జప్తు చేశారు. కల్తీ వస్తువులు, ఔషధాలు, ఆ హార పదార్థాలకు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 18005996969కు ఫిర్యా దు చేయాలని టిజి సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి తెలిపారు. ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్యలో అన్ని పనిరోజుల్లో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

భారత్, పాక్ మ్యాచ్‌లంటే అందుకే క్రేజ్..

వేలాది మంది ప్రేక్షకులతో నిండిపోయిన ఒమన్ అల్ అమరత్ స్టేడియం

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: భారత్, పాక్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ అంటే ప్రపంచ వ్యాప్తంగా వున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే యాషెస్ సీరిస్‌ను మించిన క్రేజ్ భారత్, పాక్ జట్ల మ్యాచ్‌లకు వుంటుందని అనేకసార్లు తేటతెల్లమ య్యింది. ఈ రెండు జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లకు ఏ దేశంలో అయినా భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరవుతుంటారు. ఇదే సమయంలో టీవీల ముందు కోట్లాది మంది అభిమానులు మ్యాచ్ ముగిసే వరకు అతుక్కుపోతుంటారు. ఈ రెండు జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లు చాలా వరకు ఉత్కంఠతో జరగడం, చివరి వరకు ఇరుజట్లతో గెలుపు దోబూచులాడడం ఇందుకు ప్రధాన కారణం. ఈ క్రమంలోనే భారత్, పాక్ జట్లు నేరు గా తలబడకున్నా ఐసిసి టోర్నమెంట్లలో తలబడినా సరే వీక్షకుల సంఖ్య ఎంతమాత్రం తగ్గడం లేదు. ఈ మ్యాచ్‌లకు సంబంధించిన టికెట్లు గంటల వ్యవధిలోనే హాట్ కేక్‌లా అమ్ముడు పోతుంటాయి. ఇది సీనియర్ జట్ల మ్యాచ్‌లు అయినా సరే, జూనియర్ జట్ల మ్యాచ్‌లు అయినా స రే. శనివారం నాడు ఎడారి దేశం ఒమన్‌లోని అల్ అమరత్ స్టేడియంలో జరిగిన అండర్ 19 ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ ఈ కోవలోకే చెంది నదిగా చెప్పాలి. ఈ మ్యాచ్‌ను భారత్ చివరి ఓవర్‌లో చివరి బంతికి గెలుపొందడంతో మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన వేలాది మంది చప్పట్లు, ఈలలతో హోరెత్తించారు. ఈ మ్యాచ్‌ను భారత్ గెలుస్తుందని ఎవరూ అనుకోలేదు. పాక్ సాధించిన 337 రన్ల ఛేదనలో చివరి వికెట్‌కు టైలెం డర్లు మోహిత్ ఉల్వా, వెంకటలు 30 పరుగులు జోడించి గెలిపించారు. ఒక మాటలో చెప్పాలంటే పాక్ నుంచి వీరిద్దరు మ్యాచ్‌ను లాగేసుకు న్నారు. ఈ మ్యాచ్ జరిగిన అల్ అమరత్ స్టేడియంలో 40 వేల మంది వరకు ప్రేక్షకులు వచ్చినా స్టేడియం బయట వాహనాలు, భవనాలపై వేలాది మంది నిలబడి మ్యాచ్‌ను వీక్షించారు. టీవీలో ఈ మ్యాచ్‌ను లైవ్‌లో చూపించగా దీనికి కూడా భారీగా వ్యూస్ వచ్చాయి.

తెలంగాణలో పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటండి

విదేశీ ప్రతినిధులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపు



హైదరాబాద్, నవంబరు 14 ప్రభాతవార్త: తెలంగాణ లోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటే రాయబారులుగా నిలవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విదేశీ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరిగిన భారత్ సమ్మిట్ 2026 ముగింపు సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఆర్థిక వృద్ధికి విస్తృత అవకాశాలున్న తెలంగాణ దేశంలో పెట్టుబడులకు అత్యంత ఆశాజనకమైన రాష్ట్రాల్లో ఒకటని అన్నారు. ఆవిష్కరణలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్రం ప్రధాన కేంద్రంగా ఎదిగిందని పేర్కొన్నారు. తమకున్న అంతర్జా తీయ పరిచయాలను ఉపయోగించి ఆయా దేశాల పెట్టుబడిదారులు, సంస్థలు, వ్యాపార వర్గాలను తెలంగాణతో అనుసంధానించాలని కోరారు. తెలంగాణలో వారు పొందిన అనుభవం రాష్ట్రంపై అంతర్జాతీయ ఆసక్తిని పెంచి, పెట్టుబడులు, దీర్ఘకాలిక భాగస్వామ్యాలకు దారితీయాలని ఆకాంక్షించారు.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, విదేశాల నుంచి సదస్సుకు వచ్చిన ప్రతినిధులకు, వక్తలకు, పాల్గొన్న వారందరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వారి భాగస్వా మ్యంతో సదస్సుకు సార్థకత చేకూ రిందని, ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు, కొత్తగా అందివస్తున్న అవకాశాలపై చర్చలు మరింత లోతుగా సాగాయని చెప్పారు. మారు తున్న ప్రపంచంలో భారత్ పాత్రపై పరిశీలం చేందుకు ఈ సదస్సు వేదికగా నిలిచిం దని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కృత్రిమ మేధ, క్లౌడ్ క్యాపిటలిజం, మరింత న్యాయబ ద్ధమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అవసరం, భవిష్యత్ రాజకీయాల్లో యువత పాత్ర, గ్లోబల్ సౌత్ దేశాల పరస్పర సహకారం, వాతావరణ మార్పులు, బహుపాక్షిక సంస్థల్లో సంస్కరణలు, లింగ న్యాయం వంటి అంశాలపై చర్చలు జరిగాయన్నారు. ఫోర్జింగ్ ఎ న్యూ వరల్ (నూ తన ప్రపంచ నిర్మాణం) అనే సదస్సు ఇతివృత్తం ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న కీలక మార్పులను అర్థం చేసుకొని, వాటిపై జరిగే చర్చల్లో భాగస్వాములు కావాలన్న పిలుపునిస్తోం దని మంత్రి చెప్పారు.

రాహుల్ గాంధీ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేసిన మంత్రి, రాబోయే సంవత్సరాల్లో దేశానికి నాయకత్వం వహించేందుకు అవసరమైన లక్షణాలు ఆయనలో ఉన్నాయని దేశంలో చాలా మంది భావిస్తున్నారని చెప్పారు. రాహుల్ మీ ప్రసంగాన్ని వినాలని, భారత్, ప్రపంచం పట్ల మీ దృక్పథాన్ని తెలు సుకోవాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం" అని అన్నారు. ఈ సదస్సులో జరిగిన చర్చలు, అభిప్రాయాల మార్పిడి దీర్ఘకాలిక సంబంధాలకు, మరింత విస్తృతమైన అంతర్జాతీయ సహకారానికి దారితీస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అధినేత పక్కన నడవడం మహాభాగ్యమే

బైక్ స్కిడ్ కావడంతో వెనక్కి వెళ్లాల్సివచ్చింది

3నెలల్లో సోనియా పుస్తకం తెలుగువెర్షన్: పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

హైదరాబాద్, నవంబరు 14,ప్రభాతవార్త: గిగ్ వర్కర్స్ ర్యాలీలో బైక్ స్కిడ్ కావడంతో వెనక్కి వెళ్లాల్సి వచ్చింది పరుగెత్తడంపై స్పందిస్తూ టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్ తెలిపారు. ఆయన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ ఫిట్‌గా ఉన్నా కా బట్టే పరుగెత్తుకుంటూ వచ్చాను అని అన్నారు. నేను పక్కన లేకపోవడం గుర్తించి రాహుల్ పిలిచారని రాహుల్ గాంధీ పక్కన పరుగెత్తడం నా అదృష్టం అని అన్నారు. అధినాయకుడి పక్కన నడిచే అవకాశం రావడం మహాభాగ్యం అని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రాహుల్ గాంధీ ఆరా తీశారని వివరించారు. రాష్ట్రంలో ఒబిసి ఆర్థిక సామాజిక స్థితిగతులను రాహుల్‌అడిగి తెలుసుకున్నారు! తెలంగాణ ప్రభుత్వ వనితీరుపై రాహుల్ ప్రశంసలు కురిపించినారు రేపు భవిష్యత్‌లో కూడా కేంద్రంలో అధికారంలోకి వస్తే ఇదే తరహాలో కాంగ్రెస్ పాలన దేశవ్యాప్తంగా కొనసా గిస్తామని తెలిపారని ఆయన వివరించారు.



సోనియా గాంధీ జీవిత చరిత్ర పుస్తకం బాగుందని రాహుల్ కొనియాడినట్లు చెప్పారు., మూడు నెలల్లో సోనియా గాంధీ పుస్తకం తెలుగు వెర్షన్ వస్తోందని వివరించారు. సమ్మిట్‌లో విదేశీ, భారతీయ ప్రతినిధులకు సోనియా పుస్తకాల పంపిణీ చేశామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు పుస్తకాలు అందించాలని నిర్ణయం తీసుకొ న్నామని అన్నారు.రాహుల్ ఫోన్ ట్యాపింగ్ అంశంపై చర్చ జరిగిందనీ చెప్పారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ పరిస్థితులపైనా చర్చ కూడా రాహుల్‌కు తనకు మధ్య జరిగిందని మహేష్ గౌడ్ తెలిపారు. సంపన్న కుటుంబంలో పుట్టినా.. రాహుల్ ఆలోచనలు సామాన్యుల కోసమే అని ఆయన కొనియాడారు,.

రోజు కుర్తా పైజామా వేసుకోండి : మహేష్‌కుమార్ రిక్వెస్ట్: రోజూ కుర్తా పైజామా వేసుకోవాలని రాహుల్‌ను టిపిసిసి చీఫ్ రిక్వెస్ట్ చేశారు. అయితే.. కుర్తా పైజామా ఎందుకని రాహుల్ అడుగగా అది వేసుకుంటే బాగుంటుందని మహేశ్ సమాధానం ఇచ్చారు. దీంతో సరే అంటూ నవ్వుతూ మహేశ్‌కు రాహుల్ చాక్లెట్ ఇచ్చారు.టిపిసిసి చీఫ్‌రిక్వెస్ట్‌ను అంగీకరించి అదే డ్రెస్‌లో వచ్చారు. అంతేకాదు హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ కార్యక్రమానికి కుర్తా పైజామా వేసుకొని వచ్చారు. దీంతో తన కోరిక నెరవే రడంపై మహేశ్ ఆనందం వ్యక్తం చేశారు.

చిన్నారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నాలుగు కొత్త కార్యక్రమాలకు శ్రీకారం

మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త : చిన్నారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ తెలిపారు. ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యం, మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య, ఉన్నతమైన భవిష్యత్తు అం దించేందుకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. హైద రాబాద్‌లో శనివారం నిర్వహించిన బాలల దినో త్సవ వేడుకల్లో మంత్రులు దామోదర రాజన ర్సింహా, పొన్నం ప్రభాకర్‌తో కలసి పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల సంక్షేమం, రక్షణకు సంబంధించి పలు నూతన కార్యక్ర మాలను ప్రారంభించినట్లు తెలిపారు.

బాలలపై వేధింపులు, బాల్యవివా హాలను అరికట్టడంతో పాటు, ఆపదలో ఉన్న ప్రతి చిన్నారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. చిన్నారుల భద్రత, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. బాలల దినోత్సవం సందర్భంగా నాలుగు కొత్త కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల పర్యవేక్షణకు కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థను ప్రారంభించామన్నారు. అలాగే బాల్యవివాహాల నిర్మూలనకు 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్ర మం పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించారు.



బాలల సంరక్షణ, దత్తత వ్యవస్థను విస్తరించేం దుకు ఆరు నూతన ప్రత్యేక దత్తత సంస్థలు, హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, రం గారెడ్డి జిల్లాల్లో నాలుగు కొత్త చైల్డ్‌లైన్ సహాయ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. దత్తత ప్రక్రియను మరింత వేగవంతం, సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దత్తతలో జాప్యం జరిగితే అక్రమ దత్తతకు అవకాశాలు పెరిగే ప్రమాదం ఉందని, చట్ట బద్ధమైన దత్తత ప్రక్రియను బలోపేతం చేయడం ద్వారా దీనిని అరికట్టవచ్చని చెప్పారు. పిల్లలపై కలుషిత ఆహారం, రసాయనాల ప్రభావం పడు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల బాగోగులను కాపాడాలని, వారిని సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలని పేర్కొన్నారు. అమ్మ ఒడి స్థాయిలో ఆప్యాయత, అంగన్వాడీ స్థాయిలో బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అం గన్వాడీ కేంద్రాల్లో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని విస్త రిస్తున్నామని, చిన్నారులు, సిబ్బందికి యూనిఫాంలు, ప్రీస్కూల్ కిట్లను కూడా అంది స్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ప్రారంభించిన అంగన్వాడీ సేవలను మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. బాల సదన్‌లలోని అనాథ పిల్లలకు ప్రభుత్వ గుర్తింపు పత్రాలను అందిస్తు న్నామన్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా బాల సదన్‌లలోని చిన్నా రులకు ఆధార్, ఆరోగ్య, కుల, జనన, అనాథ ధృవీకరణ వంటి పత్రాలను అందించే చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శృతి ఓజా, కమిషనర్ సంగీత సత్యనారాయణ, బాలల హక్కుల కమిషన్ సభ్యులు చందన, సరిత, వచన్, ప్రేమలత అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో కారణంగా 14.65 కోట్లమందికి ఎఫెక్ట్

న్యూఢిల్లీ, నవంబరు 14: ఒక చిన్న వాతావరణ మార్పు కోట్లాది మంది మనుషుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టగలదా? సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల దోమల వ్యాప్తి నుంచి ప్రాణాంతకమైన వడదెబ్బ వరకు ఎన్నో సమస్యలు తీవ్రమవుతాయా అంటే అవునని దీనికి కారణం ఎల్‌నినోఅని శాస్త్రజ్ఞులు చెపుతున్నారు. భూమి వాతావరణ వ్యవస్థలో జరిగే సహజమైన మార్పుల్లో ఎల్‌నినో ఒకటి. పసిఫిక్ మహాస ముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కు వగా పెరిగినప్పుడు ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మార్పు ఒక్క సముద్రానికే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపిస్తుంది. ఇప్పుడు ఈ ఎల్‌నినో ప్రభావం మరింత ఆందోళన కలిగి స్తోంది. ఇప్పటికే భూతాపంతో వేడెక్కుతున్న భూ మిపై ఎల్‌నినో మరో ఉష్ణ ప్రభావాన్ని తీసుకు రావచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరి స్తోంది. 2027 ప్రారంభం వరకు దీని ప్రభావం కొనసాగవచ్చని అంచనా వేస్తోంది. భారత్‌లో 2026 ఏప్రిల్‌లో వచ్చిన వేడిగాలుల సమ యంలో సుమారు 14 కోట్ల 65 లక్షల మంది తీవ్ర ఉష్ణోగ్రతలకు గురయ్యారు. అయితే ఈ ప్రమాదాలను ఎదుర్కోవడానికి ఒక మార్గం



ఉంది. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు.ఈ పరి ణామాల కారణంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ తొలిసారిగా ఎల్‌నినోతో ముడిపడిన ఆరోగ్య ప్రభా వాలను ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా వర్గీకరిం చింది. ఇందులో మొదటిది తీవ్రమైన వేడి. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే వడదెబ్బ, డీహైడ్రేషన్, గుండెపై ఒత్తిడి లాంటి సమస్యలు పెరుగుతాయి. రెండోది గాలి నాణ్యత. కరువులు, అడవుల్లో మంటల కారణంగా పొగ, కాలుష్య కారకాలు గాలిలోకి చేరి శ్వాసకోశ సమస్యలను తీవ్రతరం చేయవచ్చు. మరోవైపు వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు దోమల వ్యాప్తికి అనుకూలమైన పరిస్థితులను సృష్టించవచ్చు. ఫలితంగా డెంగీ, మలేరియా లాంటి వ్యాధుల ముప్పు మారుతుంది. కలుషితమైన నీటి సమస్యలు పెరిగితే కలరా లాంటి వ్యాధుల ప్రమాదం కూడా ఉంటుంది. పంటలు దెబ్బతినడం, నీటి కొరత ఏర్పడటం వల్ల ఆహార భద్రత దెబ్బతిని పోషకాహార లోపం పెరిగే అవకాశం ఉంది. ఇక 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు పారిశ్రామిక విప్లవానికి ముందు ఉన్న స్థాయితో పోలిస్తే 1.47 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యాయి.

2023 నుంచి 2026 వరకు నమోదైన నాలుగేళ్ల చరిత్రలో అత్యంత వేడిగా ఉన్న నాలుగేళ్లుగా నిలిచాయి. సముద్రాలు ఈ అదనపు వేడిలో దాదాపు 90 శాతాన్ని గ్రహిస్తున్నాయి. వాటి పై పొరల్లోనే కాదు, రెండు వేల మీటర్ల లోతు వరకు సముద్ర జలాల్లో వేడి పెరుగుతోంది. వేడెక్కిన నీరు విస్తరించడం, హిమానీనదాలు కరగడం వల్ల సముద్ర మట్టాలు కూడా పెరుగుతున్నాయి. ఈ వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పటికే కనిపిస్తోంది. యూరోప్‌లో వేడిగాలులు, కరువులు, అడవి మంటల కారణంగా ప్రాథమిక అంచనాల ప్రకారం 30 వేల మందికి పైగా అదనపు మరణాలు సంభవించాయి. 2015లో ఇలాంటి వ్యవస్థలను నివేదించిన దేశాలు 56 మాత్రమే. 2025 నాటికి ఆ సంఖ్య 136కు చేరింది.

గ్లోబల్ థింక్ ట్యాంక్‌గా 'అవర్ వరల్డ్ ఇన్‌స్టిట్యూట్'

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలి

'భారత్ సమ్మిట్ ' ముగింపు వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: అం త ర్జాతీయ అంశాలపై పరిశోధన, విధాన పరమైన చర్చలు, ప్రపంచ సమస్యలకు పరిష్కార మా ర్గాల అన్వేషణకు ఒక శక్తిమంతమైన గ్లోబల్ థింక్ ట్యాంక్‌గా 'అవర్ వరల్డ్ ఇన్‌స్టిట్యూట్'ను తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు కార్యరూపం ఇచ్చేందుకు భారత్ సమ్మిట్ వేదికగా ఈ సంస్థను ప్రారం భించామన్నారు. శనివారం హెచ్‌ఐసీసీలో నిర్వహించిన 'భారత్ సమ్మిట్ - 2026' ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సమ్మిట్‌లో భాగంగా హెచ్‌ఐసీసీలో 12 అం తర్జాతీయ ప్యానెల్స్, హైటెక్స్ లో 8 'తెలంగాణ రైజింగ్' సెషన్లతో పలు ప్రత్యేక సమావేశాలు నిర్వహిం చామన్నారు. ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సమానత్వం, వాతావరణ మార్పులు, శాంతి, మీడియా భవిష్యత్తు, ప్రజా స్వామ్య వ్యవస్థల పనితీరు తదితర అంశాలపై నిర్వహించిన చర్చల్లో వివిధ దేశాల ప్రతినిధులు, మేధావులు, పాల్గొన్నారన్నారు. ఆలోచనలు వేరుగా ఉన్నా, మరింత సమాన త్వంతో, ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్య మిస్తూ, మానవీయ దృక్పథంతో కూడిన రేపటిప్రపంచాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని అందరూ అభిప్రా యపడ్డారన్నారు. ఈ సమ్మిట్ తెలంగాణకు గౌరవంతో పాటు బాధ్యతను కూడా తీసుకొచ్చిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రపంచంతో అను సంధానమవుతూనే సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండొచ్చని... అభివృద్ధి, సంక్షేమం, ప్రజల ఆత్మగౌరవం కలిసే ముందుకు సాగొచ్చని తెలంగాణ నిరూపిస్తోందన్నారు. డిసెంబర్ 7నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0'కు హాజరు కావాలని దేశ, విదేశీ ప్రతినిధులను ఆహ్వానించారు.

గిరిబాబు మృతి పట్ల టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంతాపం

హైదరాబాద్, నవంబరు 14,ప్రభాతవార్త: ప్రముఖ సీనియర్ సినీ నటుడు, దర్శక నిర్మాత గిరిబాబు మరణం పట్ల టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తెలుగు సినీ పరిశ్రమకు గిరిబాబు అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ప్రకాశం జిల్లాలోని ఒక సామాన్య వ్యవసాయ కుటుంబంలో జన్మించిన గిరిబాబు ఐదు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో కొనసాగుతూ 600కు పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. విలన్‌గా, హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రల్లో తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించారని కొనియాడారు. నటుడిగా మాత్రమే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా తెలుగు సినీ పరిశ్రమకు విశేష సేవలందిం చారని పేర్కొన్నారు.గిరిబాబు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు మహేష్ కుమార్ గౌడ్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మహిళల విభాగం బలోపేతమే లక్ష్యం

జనసేన పార్టీ సంస్థాగత విస్తరణ

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాసరావు

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: తెలంగాణలో జనసేన పార్టీ సంస్థాగత విస్తరణలో వీరమహిళల విభాగం బలోపేతమే ప్రధాన లక్ష్యంగా కార్యచరణ రూపొందిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం తెలంగాణ వీర మహిళల ఆత్మీయ సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లా డుతూ పార్టీలో వీరమహిళలకు ఎప్పుడూ అగ్రస్థానం ఉంటుందన్నారు. పార్టీ సంస్థాగత విస్తరణలో వీరమహిళల భాగస్వామ్యం, నాయకత్వంలో వీరమహిళలకు ప్రాధాన్యం, పార్టీ బలోపేతం తదితర అంశాలకు సంబంధించి ముఖాముఖీ చర్చ జరిగింది. వీరమహిళల అభిప్రాయాలు, సూచనలకు అనుగుణంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం పలు న

తబదలతో 'పౌరసరఫరా' ప్రక్షాళన

భాగ్యనగర్ భాస్కర్‌కుమార్

పౌరసరఫరాలశాఖ అధిపతులను తరుచుగా తబదల (ట్రాన్స్‌ఫర్) చేస్తుండటంతో 2014-15నుంచి పేరుకు పోయిన కస్టమ్ మిల్లింగ్‌రైస్ బకాయి మిల్లర్ల నుంచి వసూలు చేయడం ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రక్షాళన అడుగులు తడబడుతున్నాయి. 2014 నుంచి 2026 నవంబరు వరకు ఎనిమిది మంది కమిషనర్‌లను బదిలీ చేసి ప్రస్తుతం తొమ్మిద కమీషనర్,ఎక్స్‌అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా వై.నాగిరెడ్డికిపోస్టింగ్ ఇచ్చారు. సివిల్ సప్లయ్ శాఖపై అవగాహన పెంచుకొని పరిపాలన దక్షత కనబరిచే సమయానికి బదిలీ వేటు పడుతుండటంతో అక్రమార్కులకు స్వర్గదామంగా మారింది. పోలీసులు అధికారులు వారికున్న ఆయుధ బలంతో కావొచ్చు ఐఎఎస్‌ల కంటే ఈ పోస్టులో రాణించి ప్రజల మన్ననలు పొందారనడంలో సందేహం లేదు. తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా 'మిషన్ కె100" ను స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. కొత్త దిగుబడి రాకముందే గోదాములను సిద్ధం చేసే ఉద్దేశ్యంతో, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థకి అప్పగించడంలో ఏలాంటి లోపాలు జరకుండా ఉండటానికి మిషన్‌కె100తో ప్రధానంగా దృష్టిసారిస్తుంది. ముఖ్యంగా గత 13 నెలలుగా పౌరసరఫరాలశాఖ ఎక్స్‌అఫిషియో కమీషనర్‌గా పనిచేసిన స్టీఫెన్ రవీంద్ర సివిల్ సప్లయ్‌శాఖలోని అక్రమార్కులైన అధికారులకు సిఎంఆర్ బకాయి చెల్లించని రైసుమిల్లరకు సింహస్వప్నంగా మారారు. విజిలెన్స్, సిఐడి విభాగాలను సమర్థవంతంగా ఉపయోగించి దాడులు చేయడంతో బతికుంటే బలుసాకైనా తినొచ్చని దిగివచ్చి ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యం ఇవ్వడానికి వరసకట్టారు. నిజామాబాద్ డిఎస్‌ఒపై వేటువేసి పౌరసరఫరాలశాఖ అధికారులకు కూడా అవినీతితో అంటకాగితే సహించేది లేదని గట్టిసంకేతం పంపారు. ప్రజాపంపిణీ చట్టం ధరల నియంత్ర అంశంపై క్షేత్రస్థాయిలో పోలీసు,రెవెన్యూ,సివిల్ సప్లయ్‌శాఖల మధ్య సమన్వయం తీసుకొచ్చేందుకు ఒక ప్రయత్నం ఆయన మొదలుపెట్టారు. అక్రమార్కులకు బెయిల్ రాకుండా చట్టాలలో ఉన్న లొసుగులు ఉపయోగించుకొని బయటపడకుండా ఎఫ్‌ఐఆర్ నుంచి కేసు కోర్టుకు చేరే వరకు పకడ్బందిగా ఎలా వ్యవహరించాలో ఒక మాన్యువల్ రూపొందించి మూడుశాఖల అధికారులకు ఎంసిఆర్‌డిలో శాఖపరమైన మధ్యంతర శిక్షణ కూడా ఇప్పించారు. దీనితో అక్రమవ్యాపార పద్ధతులు ఆచరించే వారికి ముందస్తుబెయిల్స్, మధ్యంతర బెయిల్స్ రావడం కష్టంగా మారింది. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వై. నాగిరెడ్డి కూడా అదే పరపంపర కొనసాగించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా కరవు సీజన్‌లో బియ్యం ఉప్పు, పప్పు



ధరలు ఆకాశాన్ని అంటుకుంటున్న సీజన్‌లో ఆయన కీలక బాధ్యతలు స్వీకరిస్తుండటంతో ప్రజల చూపు ఆయనపై కేంద్రీకృతమైంది. తెలంగాణ పౌరసరఫరాలశాఖ రైతులనుంచి ధాన్యం సేకరణ చేయడంతోపాటు ఒకకోటి ఐదులక్షలకు పైగా కుటుంబాలకు తలసరి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. మరోవైపు పెట్రోల్,డిజిల్,ఎల్‌పిజి వంటగ్యాస్ ప్రజలకు సరఫరా చేయడంలో అత్యంత కీలక పాత్రధారైన పౌరసరఫరాల శాఖకు తెలంగాణ ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో రూ. 7366 కోట్లు ప్రతిపాదించారు. ప్రభుత్వం వేల కోట్లు పేద ప్రజల కోసం బడ్జెట్‌లో పెట్టినా అవి చివరకు అక్రమార్కుల జేబులు నిపండానికి మాత్రమే దోహదపడుతున్నాయి. అక్రమార్కులను పట్టుకొన్నా పౌరసరఫరాల చట్టాలలో ఉన్న లొసుగులతో ఎంత పెద్దనేరం చేసినా చిన్నపాటి శిక్షలతో బయటపడి మళ్ళీ అదేనేరం చేయడం రివాజుగా మారింది. పౌరసరఫరాశాఖ ధాన్యం సేకరణ అంశం ఇటు రైతులను అటు ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసే తంతుగా మారింది. 2026రబీ సీజన్‌లో 72.30 ఎంఎల్‌టి ధాన్యం సేకరణ చేసి రూ.14,006కోట్లు 10.78లక్షలమంది రైతులకు చెల్లించారు. ఇంత పెద్ద ఆర్థిక యజ్ఞం ఈ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆలస్యం చేసి విక్రయ కేంద్రాలలో కుప్పలుగా పేరుకుపోయాక తూకంవేసి రైతులను దోపిడి చేసేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు తొలి పావును కదుపుతారు. కొనుగోలు కేంద్రాల్లో రైతు నుంచి క్వింటాలకు 50 రూపాయలు వసూలు చేసి అందులో 35 రూపాయలు హమాలీలకు చెల్లిస్తున్నామని మిగతా 15 రూపాయలు తాగునీరు, జనుము తాడు (సుతిలి) సమకూర్చుకోవడానికి ఖర్చు చేస్తున్నామని సెంటర్ నిర్వహకులు రైతులకు చెబుతూ దోపిడిని వ్యవస్థీకృతం చేశారు. తార్పాలిన్ కవర్లకు రోజుకు ఐదు రూపాయలు అద్దెకూడా వసూలు చేసుకొనే బిజినెస్ మొదలైంది. ధాన్యం తూకం వేశాక వాహనాలు సకాలంలో రాకపోవడంతో రైతులే సొంత ఖర్చులతో వాహనాల్లో ధాన్యాన్ని తరలిస్తున్నారు ఈ సమయంలో సొంత వాహనంలో తరలించినా వాహనానికి కొనుగోలు కేంద్ర నిర్వాహకులు డబ్బులు చెల్లించాల్సి ఉండగా చాలా ప్రాంతాల్లో చెల్లించడం లేదు. ప్రభుత్వం ఇస్తున్న ట్రక్ డబ్బులు అక్రమార్కుల జేబులు నింపుతున్నాయి. ధాన్యం తరలించే డ్రైవర్లు కూడా రైతు నుంచి బస్తాకు ఐదు రూపాయల చొప్పు బత్తాపేరుతో దోపిడి చేస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా అదనపు కలెక్టర్లకు నుంచి మొదలు కొని పౌరసరఫరాలశాఖ రెవెన్యూ క్షేత్రస్థాయి సిబ్బందికి రైసుమిల్లర్లతో ఉన్న స్నేహబంధంతో మిల్లు సామర్థ్యానికి మించి ధాన్యాన్ని కేటాయిస్తూ బహిరంగ మార్కెట్లో అమ్ముకోవడానికి దొడిదారులు చూపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సిఎంఆర్ బియ్యాన్ని ఇవ్వడానికి రేషన్ బియ్యం కొనుగోలుచేసి ఇస్తున్నారు. సిఎంఆర్ ఎగ్గొట్టిన మిల్లర్లకు క్రిమినల్ కేసులు ఆస్తుల వేలంవేస్తున్న ప్రభుత్వం వారి అక్రమాలకు అండగా నిలిచిన అధికారులపై చర్యలు తీసుకోవడం లేదనీ విమర్శలు పౌరసరఫరాలశాఖపై వినిపించేంది. పౌర సరఫరాలశాఖ కమీషనర్‌గా స్టీఫెన్ రవీంద్ర వచ్చాక పరిస్థితి మారిపోయింది. మూడేళ్ల క్రితం పెండింగ్లో ఉన్న యాసంగి సీజన్‌కు సంబంధించిన బకాయిలను ఆగస్టు ఐదులోగా త్వరితగతిన చెల్లించాల్సిందిగా మిల్లర్లకు నోటీసులతో లీగల్ చర్యలు పకడ్బందిగా తీసుకొనేందుకు సివిల్ సప్లయ్ కమీషనర్ కఠిననిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నా రు. రాష్ట్రంలో 348 రైసుమిల్లుల యజమా నులపై క్రిమినల్ కేసులు, 128 మిల్లుయజ మానులపై ఆర్ఆర్ యాక్టునునమోదు చేశా రు. స్టీఫెన్ రవీంద్రహయాం ముగిసిపోయినా ఇప్పటికి పౌరసరఫరాలశాఖలో కాలం చెల్లిన జిపిఎస్ యంత్రాలను ఇంకావాడుతున్నారు. దాని స్థానంలో ప్రతిబండికి గోదాముల్లో కేమెరాలను బిగించడంవల్ల సగం అక్రమాలు తగ్గే అవకాశం ఉంది. వడ్లు బియ్యం తరలించే వాహనాలకు జిపిఎస్ బదులుగా అదే ధరకు అందుబాటులో ఉన్నవెబ్ కెమెరాలు బిగించడంమంచిది. ప్రస్తుతం ఏఐ విస్తృతంగా వాడుకలోకి వచ్చింది.దీన్ని ఉపయోగించి మిల్లుల్లో జరుగుతున్న మోసాలను అరికట్టే అవకాశం ఉంది. ప్రతి మిల్లులో సార్ టెక్స్ యంత్రాలున్నాయి. వాటికి నియంత్రిస్తున్న కంప్యూటర్లను లేదా యంత్రాలను ఏఐతో అనుసంధానం చేసి ధాన్యం ఎంతవేశారు ఎంత మిల్లింగ్ వచ్చింది అనే విధానాన్ని ఎప్పటికప్పుడు లెక్కపెట్టి అవకాశం పరంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి. ఒక క్వింటాలు ధాన్యం మిల్లింగ్ చేస్తే ఎంత కరెంటు బిల్లు వస్తుందో ఆ మేరకు ఆ మిల్లు సిఎంఆర్ కింద పెట్టిన మిల్లింగ్ అయిన ఖర్చు అయిన విద్యుత్తు వినియోగాన్ని లెక్కిస్తే ఇట్టే దొంగతనాన్ని దొరకబట్టే అవకాశం ఉంది కానీ ఆపరంగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీనితో యథేచ్ఛగా సిఎంఆర్ బియ్యంకు రేషన్ బియ్యం వాడుతున్నారు. తూనికల కొలతల శాఖ అధికారులు తీసుకొన్న జీతాలకు న్యాయం చేయడానికి రేషన్ షాపుల్లో తూకాలను తనిఖీచేయాల్సిన అవసరంఉంది. ప్రస్తుతం మార్కెట్లో ఎలక్ట్రానిక్ కాంటాల్లో రిమోట్ కంట్రోల్‌తో తూకాన్ని నియంత్రించే ఏర్పాట్లు వచ్చాయి ఇది మార్కెట్లో రూ. 1500 లకే లభిస్తుంది ఇది ప్రతి దుకాణదారు రేషన్ షాపుల దుకాణాలు బిగించుకొని వినియోగదారులు మోసం చేస్తున్నా నియంత్రించడంలో అధికారులు విఫలమౌతున్నారు.

వార్త గత వారంలోపాఠకుల చేతిలో

కథనం

ఉత్తర ప్రదేశ్

ఉట్టి లేదు.. స్వర్గమే!

ఎ.వి.వి ప్రసాద్

ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎగురుతానందట. రెండు రోజుల క్రితం ఉత్తరప్రదేశ్‌లో ఏర్పడినకొత్త కూటమి, దాని లక్ష్యాలను చూస్తే ఆ సామెతే గుర్తుకు వస్తుంది. ఈ సారి తమకూటమి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు ఖాయమనీ, ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని సాగనంపుతామనీ ఆ కూటమి అధినేతలు అంటున్నారు. వారిలోఒకరు ఎంఐఎం పార్టీ అధినేతఅసదుద్దీన్ ఒవైసీ కాగా, మరొకరు యుపిలోని ప్రాంతీయ పార్టీ ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) అధినేత చంద్రశేఖర్ ఆజాద్. గత గురువారం లక్నోలో వారిద్దరూ కలిసి మీడియాతో మాట్లాడుతూ తమ రెండు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడ్డాయనీ, వచ్చే ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించబోతున్నామనీ ప్రకటించారు.అంతేగాక కూటమి సిఎం అభ్యర్థిగా ఆజాద్ ఉంటారని ఒవైసీ అన్నారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే ఈ కొత్త కూటమి ఎన్నికల్లో ఎటువంటి ప్రభావం చూపగలదన్నదే పరిశీలించవలసి ఉంది. మూడోసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్న ఆదిత్య నాథ్‌ను అడ్డుకొనడమే తమ ఏకైక లక్ష్యంగా ఒవైసీ,ఆజాద్‌లు సంయుక్తంగా ప్రకటించారు. తమ కూటమిలోకి రావాల్సిందిగా కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీకి ఆహ్వానం కూడా పలికారు. హైదరాబాద్ ఎంపీ అయిన ఒవైసీ తమ పార్టీని ఇతర రాష్ట్రాల్లోకి విస్తరించే ప్రయత్నం చాలా కాలం నుంచే చేస్తున్నారు.దానిలో భాగంగానే ఎంఐఎం ఇంతవరకు 14 రాష్ట్రాల నుంచి పోటీ చేసింది.కానీ రెండు మూడుచోట్ల మినహా ఎక్కడా ఉనికిని కూడా చూపలేకపోయింది. తెలంగాణ, ఎపి తర్వాత మహారాష్ట్ర, బీహార్‌లోనే ఆ పార్టీకి నాలుగైదు సీట్లు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో పట్టు సాధించాలని కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నా ఇంకా కలగానే మిగిలిపోయింది. ఈ పరిస్థితిలో ఆజాద్‌తో కలిసి ఏర్పాటు చేసిన కూటమి అనుకొన్న ఫలితాలు ఎంతవరకు సాధించగలదన్నది ప్రస్తుతానికి ప్రశ్నార్థకమే. 2017 ఎన్నికల్లో ఎంఐఎం 38 అసెంబ్లీ సీట్లకు, 2022లో 97 సీట్లకు పోటీ చేసింది కానీ ఒక్కసీటునైనా గెలవలేకపోయింది. లభించిన ఓట్లుకూడా 0.49శాతంమాత్రమే. ఇక ఆజాద్ సమాజ్ పార్టీ ఆవిర్భవించి ఆరేళ్లయింది. దళితులు, బహుజనులు, వెనుకబడిన వర్గాల వారికి ప్రాతినిధ్యం లక్ష్యంగా ఆవిర్భవించిన ఈ పార్టీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్ గతంలో భీమ్ ఆర్మీద్వారా దళిత ఉద్యమాల్లో గుర్తింపు పొందారు. మాయావతి నేతృత్వంలోని బిఎస్పీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలనే లక్ష్యంతోఆజాద్ సొంత రాజకీయ పార్టీ ఏర్పాటు చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 111 స్థానాలకు పోటీ చేసింది కానీ ఒక్క సీటును కూడా గెలవలేక పోయింది. పార్టీకి లభించిన ఓట్లు కూడా చాలా తక్కువగా 0.77 శాతం మాత్రమే.ఆజాద్ స్వయంగా గోరఖ్ పూర్ అర్బన్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి యోగిఆదిత్యనాథ్‌పై పోటీచేసి ఓడిపోయారు. మొదటి ఎన్నికల్లో సీట్లు రాకపోయినాఆజాద్ రాష్ట్రవ్యాప్తంగా తన ఉని కిని చాటుకొన్నారు. ఇక 2024 లోక్‌సభ ఎన్ని కల్లో ఆజాద్ స్వయంగా నాగినా నియోజకవర్గం నుంచి పోటీ చేసి లక్షపైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటును కూడా సాధించలేని పార్టీ నేరుగా పార్ల మెంటులోకి అడుగు పెట్టడం అప్పట్లో అందరినీ ఆశ్చర్యపరిచింది. దానితో బిఎస్పీకి ప్రత్యామ్నాయంగా మరో దళితరాజకీయ నాయకత్వంరూపు దిద్దుకొన్నదనే ప్రచారం జరిగింది. యువ దళిత ఓటర్లలో ఆజాద్‌కు తగినంత మద్దతు ఉన్నదనే ప్రచారంకూడా జరిగింది. ఆ గెలుపు ఉత్సాహంతో 2024నవంబరులో తొమ్మిది అసెంబ్లీ సీట్లకు జరిగిన ఉపఎన్నికల్లో ఆజాద్ పార్టీ పోటీచేసింది కానీ మళ్లీ ఒక్కసీటును కూడా గెలవలేకపోయింది. కేవలం మూడోస్థానానికే ఆయన పార్టీ పరిమితమైంది. అయితే రెండు మూడుచోట్ల బిఎస్పీ కంటే ఎక్కువ ఓట్లు సాధించగలిగింది. 2024



అసదుద్దీన్ ఒవైసీ

లో గెలిచిన పార్లమెంటు సీటుతో ఆజాద్ పార్టీ యుపిని దాటి రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, పంజాబ్‌లో కూడా విస్తరించే ప్రయత్నాలు చేసింది కానీ అక్కడా సీట్లుసాధించలేకపోయింది. ఇటువంటి 'విఫల చరిత్ర'తో ఆజాద్ పార్టీ ఒవైసీ పార్టీతో చేతులు కలిపి కొత్త కూటమి ఏర్పాటు చేయడమే కాక మొత్తం 403 స్థానాలకు పోటీ చేస్తామని ప్రకటించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. యుపిలో ఉంది ముస్లిం జనాభా 19 శాతం ఉండగా,దళితుల జనాభా 20శాతందాకా ఉంది. ఈ రెండు వర్గాల ఓట్లు నిజంగానే కొత్త కూటమికి మద్దతు ఇస్తే ఓట్ల శాతం 10 నుంచి 14 శాతం దాకాలభించే అవకాశం ఉంటుందని పరిశీలకుల అంచనా. అంటే అసెంబ్లీలో ఓ పాతిక ముప్పైసీట్లు లభించవచ్చు. ముస్లింలు, దళితుల ఓట్లు గంపగుత్తగా లభిస్తేనే ఆ మాత్రం సీట్లు వారికి లభించే అవకాశం ఏర్పడుతుంది. కానీ దళితుల ఓట్లు ఇప్పటికే బిఎస్పీచేతిలో ఎక్కువగా ఉన్నాయి. ముస్లింల ఓట్లను సమాజ్ వాదీ పార్టీ ఆకర్షిస్తోంది. ఆ రెండు వర్గాల ఓట్లు అటునుంచి ఇటు రావాలంటే చాలా పెద్దకృషినే చేయాల్సి ఉంటుంది.సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే ఇండియా కూటమిలో ఉంది. ఆ కూటమి కాంగ్రెస్ నాయకత్వంలో ఉంది. అందువల్ల ఆ రెండు పార్టీలు కొత్త కూటమికి మద్దతు ఇచ్చే ప్రసక్తే ఉండదు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్నఓట్లు కాంగ్రెస్ కూటమికి వెళ్లకపోతే కొత్త కూటమికి లభించేఅవకాశం ఉంటుంది. అలా లభిస్తాయనుకున్నా అవిమూడు నాలుగు శాతం కంటే ఎక్కువ ఉండకపోవచ్చు. ఎన్డీఏ, ఇండియా కూటమికి ప్రత్యామ్నాయంగా ఏర్పడిన మూడో కూటమిలోని రెండు ప్రధాన పార్టీలకు గత రెండు అసెంబ్లీఎన్నికల్లో ఒక్కసీటైనా గెలవలేకపోయినప్పుడు ఈ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు ఎలాలభించగలవో ఆ నాయకులకే తెలియాలి. ఆజాద్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. కనీసం ఆయనైనా విజయం సాధించగలరో లేదో చూడాలి. అయితే ఇండియా కూటమికి లభించగల కొన్ని ఓట్లను చీల్చడానికి ఈ కొత్త ఫ్రంట్ ప్రయత్నించవచ్చు.

కథనం

ఉక్రెయిన్

జెలెన్‌స్కీకి ఐరోపా మద్దతు!

గన్ని మోహన్

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై చర్చలు.. యూరప్ తరఫున ప్రత్యేక ప్రతినిధి నియామకంపై కసరత్తు! రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు జరుగుతున్న చర్చల్లో ఉక్రెయిన్‌కు మద్దతుగా తమ ప్రాతినిధ్యం ఉండాల్సిందేనని ఐరోపా కూటమి పట్టుబడుతోంది. అమెరికా మద్దతుతో సాగుతున్న చర్చల్లో యూరప్‌ను పక్కనపెట్టి, రష్యా, అమెరికా మాత్రమే కీలక నిర్ణయాలు తీసుకునే ధోరణి ఎంతమాత్రం ఉపేక్షించేదిలేదని తెగేసి చెపుతున్నాయి. దీనివల్ల ఉక్రెయిన్ భద్రతకు ముప్పు వాటిల్లవచ్చని యూరప్ దేశాలు భావిస్తున్నాయి.ఈ నేపథ్యంలో చర్చల్లో యూరప్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ప్రత్యేక రాయబారిని నియమిస్తామని వెల్లడించాయి. డబ్లిన్‌లో సమావేశమైన యూరోపియన్ యూనియన్ నేతలుదీనిపైచర్చిస్తున్నారు. సీనియర్ ఈయూ అధికారులు, రాజకీయ నాయకుల పేర్లు పరిశీలనలో ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ ప్రతినిధి బాధ్యతలు ఎలా ఉండాలన్న విషయంలోనూ స్పష్టత లేదు. అయితే మాస్కో, కీవ్, వాషింగ్టన్ మధ్యజరుగుతున్న చర్చల్లో యూరప్ కూడా భాగస్వామి కావాల్సిన అవసరం ఉండాల్సిందేనని బ్రిటన్ నుంచి ఉక్రెయిన్ వరకు పలు దేశాలు ఏకాభిప్రాయంతో ఉన్నాయి. అమెరికా ప్రభుత్వం తరఫున మాత్రమే చర్చలు జరగడంపై ఉక్రెయిన్ అసంతృప్తిగా ఉంది. ఎందుకంటే అమెరికా ప్రభుత్వం పలుమార్లు రష్యా వైఖరికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు కనిపించిందని ఉక్రెయిన్ భావిస్తోంది.అందువల్ల యూరోపియన్ మిత్రదేశాల మద్దతును కీవ్ కోరుకుంటోంది.మరోవైపు, ఉక్రెయిన్ సైనిక చర్యలకు నిధులు సమకూరుస్తూ, ఆయుధాలు సరఫరాచేస్తున్నయూరప్ దేశాలు ప్రత్యక్ష చర్చల్లో పాల్గొనడాన్ని రష్యా వ్యతిరేకిస్తోంది. గ్రీన్‌లాండ్, ఇరాన్, ఉక్రెయిన్ వివాదాల విషయంలో ఇటీవల అమెరికాతో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ తరఫున చర్చలు జరుపుతారని యూరోపియన్ దేశాలు పూర్తిగా విశ్వసించడం లేదు. యూరోపియన్లు లేకుండా ఉక్రెయిన్‌కు మద్దతు ఈ భేటీలో లభించదన్న ప్రభలంగా నమ్ముతున్న ఐరోపాదేశాలు తమ రాయబారి ఉండాల్సిందేనని జెలెన్‌స్కీకి మద్దతు ఐరోపా నుంచే ఎక్కువ అవసరం అవుతుందని తెగేసి చెపుతున్నాయి. యూరోపియన్లుగా మనభవిష్యత్ భద్రతను మనమే నిర్ణయించుకుని, నిర్ణయించుకోవాల్సి ఉంటుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు తన ఐక మత్యం ప్రదర్శించారు. యూరప్ దేశాల మధ్య ఏకాభిప్రాయంతోపాటు విభేదాలున్నాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ట్రంప్‌పై ఒత్తిడి తెచ్చి ఉక్రెయిన్‌తో పాటు మొత్తం యూరప్ భద్రతను బలహీనపరిచే శాంతి ఒప్పందానికి అంగీకరింపజేస్తారని యూరోపియన్ నేతలు ప్రగాఢ నమ్మకంతో ఉన్నారు. రష్యా సరిహద్దుల నుంచి నాటో సేనలను వెనక్కి తీసుకోవాలని, ఉక్రెయిన్‌లో యూరోపియన్ బలగాలను మోహరించకూడదని పుతిన్ డిమాండ్‌చూస్తుంటే. శాంతి చర్చల్లో యూరప్‌ను పక్కనపెడుతున్నారన్నది తేలిందని బ్రిటన్ ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్‌కూడా అన్నారు. ఇపుడు చర్చల వేదికపై జెలెన్‌స్కీని ఒంటరిచేసి అమెరికా మద్దతుతో రష్యా తనకు సానుకూలం చేసుకోవాలి, కుట్రలను ఎలాగైనా భగ్నం చేయాలని ఐరోపా భావిస్తోంది. ముందునుంచి నాటోలో చేరకూడదని షరతులుపెడుతూ వచ్చినరష్యా అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికీ అదేపనిలో ఉన్నారు. అంతేకాకుండా ఉక్రెయిన్‌కు ఐరోపా దేశాలు ఆయుధ సరఫరాలు ఉండకూడదని, సేనలను వెనక్కి రప్పించాలన్న డిమాండ్లు ముందుపెట్టారు. దీనిపై ఐరోపా కూటమి మొత్తందేశాల్లో తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమైంది. బ్రిటన్‌ప్రధాని చర్చలు జరిపిన ఈయూ నాయకులందరూ ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీకి గట్టి మద్దతుగా నిలవాలని నిర్ణయించుకున్నారు.



జెలెన్‌స్కీ

ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటాం' అని చెప్పడాన్ని చూస్తుంటే ఉక్రెయిన్‌ను ఏకాకి కానీయకూడదన్న బలమైన ఆకాంక్ష ఈయూలో కనిపిస్తోంది. అబుదాబిలో అమెరికా, రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధులు సమావేశమైన సమయంలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ సహా పలు యూరోపియన్ దేశాలు సమీపంలో జరిగినచర్చల్లో పాల్గొన్నాయి.యూరప్ తరఫున ఒకే అధికారిక గొంతుకతో మాట్లాడేందుకు ఉమ్మడి ఈయూప్రతినిధిని నియమించాలని ఇటలీ పట్టుబడుతోంది. అయితే ఇది కేవలం యూరోపియన్ యూనియన్‌కే పరిమితం కాకూడదని, బ్రిటన్, నార్వే, కెనడా తదితర దేశాలతో కూడిన విస్తృత యూరోపియన్ దృక్పథం అవసరం అవుతుందన్న భావనతో ఉంది. మరోవైపు రష్యాప్రతినిధి మాట్లాడుతూ యూరోపియన్లు ఒక గాజు సీసాలోని సాలెపురుగుల్లా పరస్పరం గొడవపడుతున్నారు. రష్యాతో సంబంధాలు ఏర్పరచుకునేందుకు ఎవరైనాచొరవ తీసుకుంటేవారిని వెలివేస్తున్నారని ఆయన అన్నారు. యూరప్ తరఫున ఎవరు మాట్లాడాలన్న ప్రశ్న కొత్తదేమీ కాదు. అసలు యూరప్ అంటే ఏ దేశాల సమూహం అన్న దానిపైనా స్పష్టత లేదు. 27 దేశాల యూరోపియన్‌యూనియనా? ప్రధానంగా యూరోపియన్ దేశాలతో కూడిన 32 సభ్య దేశాల నాటో కూటమా? 29 దేశాల షెంగెన్ ప్రాంతమా? లేక 47 దేశాలతో కూడిన యూరోపియన్ పొలిటికల్ కమ్యూనిటీనా? అన్న ప్రశ్నలు ఉన్నాయి. ఈ విషయంలో స్పష్టత లేకపోవడం గతంలోనూ, ప్రస్తుతం కూడా అమెరికాకు ఇబ్బందిగామారింది. మొత్తంగా చూస్తుంటే నాలుగేళ్లకుపైబడి కొనసాగిన ఉక్రెయిన్ రష్యా యుద్ధం ముగింపుకోసం అటు అమెరికాతోపాటు ఇటు ఈయూ కూటమి కూడా గట్టిపట్టుదలతో ఉంది. చర్చల్లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఒంటరి కాకుండా ఈయూ శతవిధాలా ప్రయత్నాలు చేస్తోంది.అయితే ఎటొచ్చీ చర్చల్లో పుతిన్‌ను ఒప్పించడమే ఇప్పుడుఈయూ అయినా అటు అమెరికాకు అయినా అతిపెద్ద సవాలుతో కూడుకున్న కర్తవ్యం అని చెప్పకతప్పదు.

కథనం

డెమొక్రాట్ల విజయం అగ్నిపరీక్ష

తిప్పర్తి శ్రీనివాస్

ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేసే అమెరికాలో ఎన్నికల ఫలితాలు మరోసారి రాజకీయ సమీకరణాలను మార్చేశాయి. 2026 మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ సాధించిన ఘన విజయాలు అగ్రరాజ్య రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీశాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఎదురైన ఎదురుదెబ్బ ఒకవైపు ఉంటే, మరోవైపు ఈవిజయాన్ని 2028 అధ్యక్ష ఎన్నికలకు పునాదిగా మలుచుకోవాలని డెమొక్రాట్లు భావిస్తున్నారు. అయితే ఎన్నికల్లో గెలవడం ఒక ఎత్తయితే, ఆ విజయాన్ని నిలబెట్టుకుంటూ పార్టీని ఐక్యంగా ముందుకు నడిపించడం మరోఎత్తు. ప్రస్తుతం డెమొక్రాట్ల ముందున్న అసలైన సవాలు ఇదే. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు సాధారణంగా అధికారంలో ఉన్న అధ్యక్షుడి పాలనపై ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయి. అధ్యక్ష ఎన్నికల మధ్యలో జరిగే ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభ,సెనేట్ సభ్యులను ప్రజలు ఎన్నుకుంటారు. నవంబర్ 3న జరిగిన ఎన్నికల్లో డెమొక్రాట్లు ప్రతినిధుల సభతోపాటు సెనెట్‌లోనూ ఆధిక్యం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా సంప్రదాయకంగా రిపబ్లికన్లకు అనుకూలంగా ఉండే కొన్ని రాష్ట్రాల్లోనూ డెమొక్రాట్లు విజయాలు నమోదు చేయడం ట్రంప్ ప్రభుత్వానికి గట్టి హెచ్చరికగా మారింది. అయితే కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ 2027 జనవరి 3న బాధ్యతలు స్వీకరించనుంది. అప్పటివరకు ప్రస్తుత అధికార సమీకరణాలే కొనసాగుతాయి. ఈ విజయం ద్వారా డెమొక్రాట్లకు రాబోయే రెండేళ్ల రాజకీయ దిశను నిర్ణయించే అవకాశం లభించింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అనుసరిస్తున్న విధానాలు అమెరికా రాజకీయాల్లో తీవ్ర చర్చకు కారణమయ్యాయి. దిగుమతులపై సుంకాలవిధింపు, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు, వలసల నియంత్రణ, విదేశాంగ విధానం వంటి అంశాలు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం, దాని కారణంగా పెరిగిన ఇంధన ధరలు, నిత్యావసర వస్తువుల వ్యయం సామాన్య అమెరికన్లపై ఆర్థిక భారాన్ని పెంచాయి. జీవన వ్యయం తగ్గుతుందనే ఆశించిన ప్రజలకు ధరల పెరుగుదల నిరాశ కలిగించింది. నవంబర్ 9న వెల్లడైన రాయిటర్స్-ఇప్సోస్ సర్వేలో ట్రంప్ పాలనకు మద్దతు కేవలం 32శాతానికి పరిమితమైంది. జీవన వ్యయ నియంత్రణ విషయంలో ఆయన పనితీరును సమర్థించిన వారు కేవలం 21 శాతం మందే. ఈ గణాంకాలు ప్రజల్లో నెలకొన్న అసంతృప్తికి అద్దంపడుతున్నాయి. ప్రజల రోజువారీ జీవితాలను ప్రభావితం చేస

అందుబాటు ధరల్లో కేన్సర్ మందులు

రోగుల ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం : కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి జెపి నడ్డా

న్యూఢిల్లీ, నవంబరు 14(ప్రభాతవార్త): కేన్సర్ అనేమాట ఒక కుటుంబ జీవితాన్ని క్షణాల్లో మార్చేస్తోంది. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత రోగులు, వారి కుటుంబ సభ్యులు చికిత్స, ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నో కఠిన నిర్ణయాలు తీసుకోవల్సి వస్తోంది. మందుల ఖర్చులు కుటుంబాలకు అదనపు భారంగా మారుతాయి. ఇలాంటి సమయంలో కుటుంబంలోని ప్రతి వనరును రోగి కోలుకోవడానికి వినియోగించాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్రం గుర్తించిన 137 నాన్ షెడ్యూల్డ్ కేన్సర్ నిరోధక మందులపై ట్రేడ్ మార్జిన్లను హేతుబద్ధీకరించింది. కేన్సర్ చికిత్సను మరింత అందుబాటు ధరల్లోకి తీసుకురావడానికి ఓ అడుగు ముందుకు వేసింది. నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ మందుల గరిష్ఠ చిల్లర ధరపై ట్రేడ్ మార్జిన్‌ను గరిష్ఠంగా 30 శాతానికి పరిమితం చేసింది. సవరించిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. 80కిపైగా ఔషధ తయారీ సంస్థలు, 137 మందుల్లో 121 మందులకు సంబంధించిన 1366 ఉత్పత్తుల ధరలను ఇప్పటికే ప్రకటించాయి. వాటిలో ప్రతి ఐదు ఉత్పత్తుల్లో నాలుగు కంటే ఎక్కువ ఉత్పత్తుల ధరలు తగ్గాయి. కీమోథెరిపి చికిత్సను పలుమార్లు చేయించుకోవల్సిన కుటుంబాలకు ఈ తగ్గింపు ఎంతో ఊరట నిస్తోంది. గత ఏడాది మందుల వినియోగం ఆధారంగా అంచనా వేస్తే రోగులు, వారి కుటుంబాలకు ఏటా రూ.3500 కోట్ల వరకూ ఆదా కానున్నది.



ఖర్చులను గుర్తించిన ప్రభుత్వం...

మందుల పంపిణీ వ్యవస్థలో అధిక లాభాల మార్జిన్లు చికిత్సకు అయ్యే భారీ ఖర్చులను గుర్తించిన ప్రభుత్వం ఈ వ్యత్యాసాన్ని సరిచేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ట్రేడ్ మార్జిన్లను గరిష్ఠంగా 30 శాతానికి పరిమితం చేసింది. తగ్గింపు ప్రక్రియపై కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. సవరించిన ధరలను రోగులు, వారి సంరక్షులు ఎన్పీపీఏ వెబ్ సైట్, ఫార్మా సహీ దామ్ యాప్ ద్వారా తెలుసుకునే వెసులుబాటును కల్పించింది. నిర్ణీత ధరకంటే అధిక వసూలు చేసే ఔషధ దుకాణాలు లేదా ఆస్పత్రులపై ఫిర్యాదు చేయాలని కేంద్రం సూచిస్తోంది. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఆస్పత్రి వైద్యసేవలు మరింత చేరువయ్యాయి. మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయాలతో ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యసేవలు, అందుబాటులోకి మందుల ధరలు రావడం శుభపరిణామం. దీంతో ప్రాణ రక్షక ఔషధాలపై ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంది.

యుపి అసెంబ్లీ ఎన్నికలకు ఎస్పీ కాంగ్రెస్ సీట్ల సర్దుబాట్లు

లక్నో, నవంబరు 14: ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. మరోవైపు పార్టీలు పొత్తులు, సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుపుతున్నాయి. అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), కాంగ్రెస్ మధ్య పొత్తుపై నవంబర్ 17న కీలక చర్చలు జరగబోతున్నాయి. ఈ చర్చల్లో అఖిలేష్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొనున్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు పార్టీల మధ్య పొత్తు, సీట్ల పంపకాలపై భేటీ జరగనున్నది. 403 అసెంబ్లీ సీట్లు ఉన్న యూపీలో కాంగ్రెస్ 200కు పైగా సీట్లు కోరుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. సీట్ల కేటాయింపుకు సంఖ్య ఆధారం కాకూడదని, గెలుపు మాత్రమే ఆధారం కావాలని ఎస్పీ చెబుతోంది. 2022 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మొత్తం 403 స్థానాలకు గాను 399 చోట్ల అభ్యర్థులను నిలబెట్టింది. అయితే, ప్రతాప్‌గఢ్ జిల్లాలోని రాంపూర్ ఖాస్, మహారాజ్‌గంజ్ జిల్లాలోని ఫరెండా నియోజకవర్గాల్లో మాత్రమే విజయం సాధించింది. మరో నాలుగు స్థానాల్లో రెండో స్థానంలో నిలిచింది.

ఒకే వేదికపైకి ముగ్గురు అగ్ర రాజ్యాధిపతులు

వచ్చేవారం ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్ భేటీ

బీజింగ్, నవంబరు 14: ప్రపంచ రాజకీయాల్లో ఒక అరుదైన ఘట్టానికి రంగం సిద్ధమైంది. ప్రపంచంలోని మూడు అతిపెద్ద అణుశక్తి దేశాలైన అమెరికా, రష్యా, చైనా అధినేతలు ఒకే వేదికపై సమావేశం కానున్నారు. వచ్చే వారం చైనాలోని టెక్ హబ్ షెన్‌జెన్‌లో జరిగే ఆసియాపసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఏపీఈసీ) సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఈ త్రైపాక్షిక భేటీ జరగనుంది. ఈ మేరకు వైట్ హౌస్ అధికారికంగా ధ్రువీకరించింది. ఈ ముగ్గురు నేతలు కలవడం చరిత్రాత్మకమే అయినప్పటికీ, ఈ చర్చల ద్వారా పెద్దగా ఫలితాలు వస్తాయని ఆశించలేమని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం ప్రతీకాత్మక సమావేశంగానే మిగిలిపోవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ మూడు దేశాల మధ్య సంబంధాలు సంక్లిష్టంగా ఉన్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికాఇరాన్ యుద్ధం, రష్యాఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఈ సమావేశం జరగడం గమనార్హం. ముఖ్యంగా ఇరాన్‌తో యుద్ధం, అణ్వస్త్ర నిల్వలపై మూడు దేశాల మధ్య ఒక కొత్త ఒప్పందం కుదుర్చుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశం ఉపయోగపడుతుందని ట్రంప్ భావిస్తున్నారు. అమెరికా, రష్యాల మధ్య ఉన్న చివరి అణ్వాస్త్ర ఒప్పందం గత ఫిబ్రవరిలోనే ముగిసింది. దీంతో అర్ధ శతాబ్దం తర్వాత తొలిసారిగా ప్రపంచంలోని రెండు అతిపెద్ద అణు నిల్వలపై ఎలాంటి పరిమితులు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో చైనాను కూడా భాగస్వామ్యం చేస్తూ కొత్త ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ ప్రతిపాదిస్తున్నారు. ఈ ప్రతిపాదనపై చైనా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అమెరికా, రష్యాల వద్ద సుమారు 5,000కు పైగా అణ్వాస్త్రాలు ఉండగా, చైనా వద్ద కేవలం 600 మాత్రమే ఉన్నాయని అంచనా. తమకన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా అణ్వా లు ఉన్న దేశాలతో సమానంగా ఒప్పందం చేసుకోవడానికి బీజింగ్ విముఖత చూపుతోంది. ఈ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ప్రపంచంలో తమ పెరుగుతున్న పలుకుబడిని, ప్రతిష్ఠను చాటుకో వాలని జిన్‌పింగ్ భావిస్తున్నారు. అమెరికా, చైనాలతో సమానంగా తమను కూడా ఒక అగ్రరాజ్యంగా ప్రదర్శించుకోవడానికి పుతిన్‌కు ఈ భేటీ ఒక సువర్ణావకాశం. ఉక్రెయిన్ విషయంలో తామే కీలక నిర్ణయాలు తీసుకుంటామనే సంకేతాలు పంపాలని ఆయన భావిస్తున్నారు. ఇప్పటికే పుతిన్, జిన్‌పింగ్ మధ్య బలమైన స్నేహబంధం ఉంది. ట్రంప్ కూడా ఇరు నేతలతో సంబంధాలు మెరుగుపరుచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమావేశం ద్వారా ఉక్రెయిన్ విషయంలో తమ ప్రమేయం లేకుండా ఏదైనా ఒప్పందం కుదుర్చుకుంటారేమోనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం మీద ప్రపంచ భవిష్యత్తును నిర్దేశించే ఈ ముగ్గురు నేతల భేటీలో ఎలాంటి నిర్ణయాలు వెలువడతాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ప్రధాని మోడీ ఫోన్లు ట్యాప్‌చేయరు



కాంగ్రెస్ ఐటి నేత శామ్‌పిట్రోడా

న్యూఢిల్లీ, నవంబరు 14: ప్రధాని మోడీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ఇదిలా ఉంటే, రాహుల్ వ్యాఖ్యలకు భిన్నంగా కాంగ్రెస్ సీనియర్ నేత సామ్ పిట్రోడా స్పందించారు. మోడీ స్వయంగా ఫోన్లు ట్యాప్ చేయరని తాను భావిస్తున్నట్టు వ్యాఖ్యానించారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో, తన ఫోన్ ట్యాప్ అవుతోందని, ల్యాప్‌టాప్‌పై , బ్యాంక్ అకౌంట్లపై నిఘా ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని టెక్ నిపుణులతో పరిశీలించానని, వారు కూడా తన పరికరాలపై నిఘా ఉండచ్చని హెచ్చరించారని తెలిపారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై సామ్ పిట్రోడా స్పందిస్తూ ప్రధాని అలా చేయరు. ఆయన స్క్రూల్ డ్రైవర్ పట్టుకుని కంప్యూటర్ దగ్గర కూర్చుని ఫోన్లు ట్యాప్ చేయరని అన్నారు. తన ఫోన్ ఎవరు ట్యాప్ చేస్తున్నారనే విషయంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశించి సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాని మోడీ తన ఫోన్ ట్యాప్ చేస్తున్నారని, దీనికి సంబంధించిన సమాచారం గురించి ముందే తెలుసని ఆరోపించారు. నాతో ముఖాముఖి చర్యకు అంగీకరించిన రోజు, విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరు ఉన్నారు. ఎవరు దేశానికి వ్యతిరేకి. ఎవరు దేశ వ్యతిరేఖ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అనే విషయాలు అందరికీ తెలుస్తాయని రాహుల్ అన్నారు. రాహుల్ చేసిన వ్యాఖ్యల్ని బీజేపీ నేతలు కొట్టిపారేశారు. బీజేపీ నేత, మాజీ కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందిస్తూ.. రాహుల్ తన మానసిక పరిస్థితిని పరీక్షించుకోవాలని, ఆయన ఫోన్ ట్యాప్ చేయడంపై ఎవరికీ ఆసక్తి లేదని, ఆయన మెదడు రోజూ ఎందుకు అబద్ధాలు చెబుతుందని తెలుసుకోవాలనే ఆసక్తి ఉందొచ్చని వ్యాఖ్యానించారు.

వాసీనాను సైనిక పర్యవేక్షణలోనే తీసుకెళ్లాలి

మరణశిక్ష అప్పీలుకు అవకాశం ఇవ్వాలి

బంగ్లాదేశ్ ముందు భారత్ డిమాండ్లు



న్యూఢిల్లీ,నవంబరు 14: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు భారత్ సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఆమె భద్రతకు, న్యాయపరమైన హక్కులకు హామీ లభించిన తర్వాతే ఇందుకు అంగీకరించాలని భావిస్తున్నట్లు బీబీసీ బంగ్లా కథనం వెల్లడించింది. హసీనా తిరుగు ప్రయాణాన్ని బంగ్లాదేశ్ సైన్యం పర్యవేక్షించాలని, అక్కడ ఆమెకు కొత్తగా నిష్పాక్షిక విచారణ జరిగేలా ఢాకా హామీ ఇవ్వాలని న్యూఢిల్లీ కోరుతున్నట్లు పేర్కొంది. డిసెంబరులో స్వదేశానికి వెళ్తానని హసీనా ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో అప్పటి ప్రధాని హసీనా సైనిక విమానంలో భారత్‌కు చేరుకున్నారు. ఇప్పుడు ఆమెను తిరిగి తీసుకెళ్లే బాధ్యతను కూడా బంగ్లాదేశ్ సైన్యమే చేపట్టాలని భారత్ కోరుతున్నట్లు బీబీసీ బంగ్లా తెలిపింది. సైనిక విమానం ద్వారా ఢిల్లీ నుంచి తీసుకెళ్లడం లేదా నిర్దేశిత సరిహద్దు ప్రాంతంలో సైన్యం ఆమెను స్వీకరించడం వంటి మార్గాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు భారత్ సిద్ధం గా ఉందని కథనంలో వెల్లడించింది. హసీనాకు విధించిన మరణశిక్షపై అప్పీలు చేసుకునే అవకాశం కల్పించాలని భారత్ కోరుతున్నట్లు సమాచారం. 2024 జులైలో జరిగిన హింసాకాండకు సంబంధించిన ఆరోపణలపై కొత్తగా, నిష్పాక్షికంగా విచారణ జరగాలని భావిస్తున్నట్లు బీబీసీ పేర్కొంది. అంతర్జాతీయ సమాజం, ప్రపంచ మీడియా పర్యవేక్షణలో విచారణ సాగాలని భారత విదేశాంగ శాఖకు చెందిన ఓ అధికారి అభిప్రాయపడినట్లు తెలిపింది. ఆమెను ఉరితీసే పరిస్థితులకు అప్పగించబోమని, న్యాయమైన విచారణకు అవకాశం ఉండాలని భారత్ కోరుకుంటోందని ఆ అధికారి పేర్కొన్నట్లు కథనం వెల్లడించింది. హసీనా తిరుగు ప్రయాణానికి సంబంధించి భారత్, బంగ్లాదేశ్ మధ్య కొన్ని నెలలుగా తెరవెనుక చర్చలు జరుగుతున్నట్లు బీబీసీ బంగ్లా తెలిపింది. అక్టోబరు మొదటి వారంలో బంగ్లాదేశ్‌లో భారత హైకమిషనర్ దినేశ్ త్రివేది ఢిల్లీలో ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేత్‌తో సమావేశమయ్యారని పేర్కొంది. అక్టోబరు 6న జరిగిన ఈ భేటీలో ద్వైపాక్షిక సహకారం, రక్షణ సంబంధాల బలోపేతంపై చర్చించినట్లు భారత సైన్యం ఎక్స్‌లో వెల్లడించింది. అయితే ఈ సమావేశం హసీనా తిరుగు ప్రయాణానికి సంబంధించినదేనని బీబీసీ కథనం పేర్కొంది. హసీనా నవంబరు 9న కొత్త పాస్‌పోర్టు, ప్రయాణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవడం ద్వారా ప్రవాసం తర్వాత బంగ్లాదేశ్ ప్రభుత్వంతో తొలి అధికారిక సంప్రదింపులు ప్రారంభించారు. అయితే ఢాకా నుంచి సానుకూల స్పందన రాలేదు. ఆమెను అప్పగించాలని బంగ్లాదేశ్‌లోని కొందరు నేతలు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు డిసెంబరులో స్వదేశానికి వెళ్తానని హసీనా ప్రకటించారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆమె రాక సాధ్యపడకపోవచ్చని భారత అధికార వర్గాలు భావిస్తున్నట్లు బీబీసీ తెలిపింది. ఆమె తిరిగి వస్తే బంగ్లాదేశ్ ఎదుర్కొంటున్న సమస్యలు మరింత పెరుగుతాయని ఢాకా భావిస్తోందని కథనంలో పేర్కొంది. హసీనాకు ఆశ్రయమిచ్చేందుకు ఏ దేశమూ ముందుకు రావడం లేదని బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహమాన్ సహాయ ప్రెస్ కార్యదర్శి కేఎం నజ్ముల్ హక్ ఫేస్‌బుక్‌లో వ్యాఖ్యానించారు. అయితే భారత్ షరతులు విధించినట్లు వచ్చిన కథనాలపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించేందుకు నిరాకరించారు.

అమెరికాలో నిలిచిన 11 వేల విమానాలు

వాషింగ్టన్,నవంబరు 14: అమెరికాలో విమానాలన్నీ నాలుగు గంటలపాటు రన్‌వేలపైనే నిలిచిపోయాయి. 15 లక్షల మంది ప్రయాణికులకు కష్టాలు అమెరికాలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కమ్యూనికేషన్ వ్యవస్థలో సాంకేతిక లోపంతో వేలాది విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 15 లక్షల మందికిపైగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఒక్క కమ్యూనికేషన్ లోపం అమెరికా విమానయాన రంగాన్ని కుదిపేసింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థలో కమ్యూనికేషన్ వైఫల్యంతో దేశవ్యాప్తంగా వేలాది విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లక్షలాది మంది ప్రయాణికులు గంటలతరబడి విమానాశ్రయాల్లోనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. నాలుగు గంటలకుపైగా కొనసాగిన ఈ అంతరాయం అగ్రరాజ్య విమానయాన వ్యవస్థలో దశాబ్దాల నాటి సాంకేతిక లోపాలను మరోసారి తెరపైకి తెచ్చింది. అమెరికాలో శుక్రవారం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థలో సాంకేతిక సమస్య తలెత్తింది. విమానాశ్రయాలు, విమానాల మధ్య సమాచార మార్పిడికి ఉపయోగించే కమ్యూనికేషన్ నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో

15 లక్షల మంది ప్రయాణికులకు కష్టాలు



విమానాల బయలుదేరే ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. సమస్యకు అసలు కారణమేంటన్నది వెంటనే గుర్తించలేకపోవడంతో నాలుగు గంటలకు పైగా విమాన రాకపోకలను నిలిపివేశారు. అమెరికాలోని ప్రధాన విమానాశ్రయాలన్నీ ఈ ఆదేశాలను అమలు చేశారు. కొన్ని విమానాలు రన్‌వేపైనే నిలిచిపోగా మరికొన్ని విమానాల్లోని ప్రయాణికులను దింపేశారు. విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఏం జరుగుతుందో తెలియక అయోమయానికి గురయ్యారు. విమానయాన విశ్లేషణ సంస్థ సిరియం లెక్కల ప్రకారం ఈ అంతరాయం ప్రారంభమైన తర్వాత భారత కాలమాన ప్రకారం శనివారం తెల్లవారు జామున 2.30 గంటల నుంచి అమెరికా విమానా శ్రయాల నుంచి సుమారు 11 వేల విమానాలు బయలుదేరాల్సి ఉంది. వీటిలో 15 లక్షల మందికిపైగా ప్రయాణికులు ప్రయాణించాల్సి ఉంది. కానీ ఒక్క సాంకేతిక సమస్యతో లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అమెరికా విమానయాన వ్యవస్థలో దశాబ్దాల నాటి పరికరాలే ఇప్పటికీ వినియోగంలో ఉన్నాయని రవాణా శాఖ మంత్రి సీన్ డఫీ వెల్లడించారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లోని పాత రౌటర్లు, స్విచ్‌లపై అధిక డేటా భారం పడటంతో సమాచారంలో అసమానతలు ఏర్పడ్డాయని వివరించారు. దీంతో విమానాల కదలికలను పర్యవేక్షించే కేంద్రాలకు సరైన సమాచారం అందకపోవడంతో భద్రత దృష్ట్యా విమానాల బయలుదేరడాన్ని నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పరికరాల్లో ఎలాంటి సమస్య లేదని, పాత పరికరాల వైఫల్యమే ఈ పరిస్థితికి కారణమని చెప్పారు. నెట్‌వర్క్‌పై భారం తగ్గించేలా సాంకేతిక మార్పులు చేపట్టడంతో సమస్య పరిష్కారమైందని వివరించారు. అమెరికా విమానయాన వ్యవస్థను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు కాంగ్రెస్ 50 బిలియన్ డాలర్ల నిధులు కేటాయించాలని కోరారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా సమగ్రంగా వ్యవస్థను మార్చాలని సూచించారు. దాదాపు నాలుగు గంటలపాటు కొనసాగిన అంతరాయం తర్వాత అమెరికా తూర్పు కాలమానం ప్రకారం రాత్రి 8.15 గంటలకు భారత కాలమాన ప్రకారం శనివారం ఉదయం 7.45 గంటలకు గగనతలాన్ని తిరిగి తెరిచినట్లు సీన్ డఫీ ప్రకటించారు.

రామ్‌లీలాలో సభలకు ఇకపై కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ, నవంబరు 14: ఢిల్లీలోని చారిత్రక రామ్‌లీలా మైదానంలో నిరసనలు, ప్రదర్శనలు, ర్యాలీలు, బహిరంగ సభల నిర్వహణకు ఢిల్లీ పోలీసులు సరికొత్త మార్గదర్శకాలను ప్రతిపాదించారు. ఈ మేరకు ఒక ప్రామాణిక నిర్వహణ విధానం ముసాయిదాను రూపొందించి, ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం రామ్‌లీలా మైదానంలో జరిగే ఏ కార్యక్రమానికైనా గరిష్ఠంగా 50వేలమంది మాత్రమే హాజరుకావడానికి అనుమతిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల మధ్య, అంటే 7 గంటల వ్యవధిలోనే కార్యక్రమాలను ముగించాల్సి ఉంటుంది. దీనిప్రకారం నిరసన కార్యక్రమాలను నిర్వహించాల నుకునే వారు కనీసం 10రోజుల ముందుగానే పోలీసులకు దరఖాస్తు చేసుకోవాలి. అంతకుముందు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) నుంచి వేదిక లభ్యత ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలి. ఈ సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు జత చేయాల్సి ఉంటుంది. మైదానం మొత్తం సామర్థ్యం 50వేలు అయినప్పటికీ, ప్రతి కార్యక్రమానికి హాజరయ్యే వారి సంఖ్యపై తుది నిర్ణయం సంబంధిత అధికారి తీసుకుంటారు. సభ స్వభావం, హాజరయ్యే జనాల అంచనా, భద్రతా ఏర్పాట్ల అవసరాన్ని బట్టి ఈ సంఖ్యను నిర్ధారిస్తారు. భద్రత, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించి కూడా కఠిన నిబంధనలను ఇందులో చేర్చారు. కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లపై నిర్వాహకులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలి. అత్యవసర వాహనాల రాకపోకలకు ఉద్దేశించిన రహదారులను, ఫుట్ పాత్‌లను ఎలాంటి పరిస్థితుల్లోనూ దిగ్బంధించకూడదని స్పష్టం చేశారు. ప్రదర్శనలో పాల్గొనేవారు ఆయుధాలు, మండే పదార్థాలు లేదా చట్టవిరుద్ధమైన వస్తువులను తీసుకురావ డంపై నిషేధం విధించారు.

సంక్షిప్త వార్తలు

అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తాం: డికె

బెంగళూరు, నవంబరు 14: రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న చర్చలపై స్పందిస్తూ రాజకీయాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని వ్యాఖ్యానించారు. రాజకీ యాల్లో పోటీ పడతాం అభివృద్ధిలో సహకరించుకుంటాం అని పేర్కొన్నారు. బెంగళూరులో శుక్రవారం పింక్‌లైన్ మెట్రో ప్రారంభోత్సవం సహా పలు కార్యక్రమాల్లో మోడీతో శివకుమార్ సరదాగా మాట్లాడటం, సన్నిహితంగా మెలగడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.



సీనియర్ మహిళా బిజెపి నేతకు మోడీ వైద్యసాయం

మైసూరు, నవంబరు 14: ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి వార్తల్లో నిలిచారు. కర్ణాటకలోని మైసూరులో జరిగిన ఓ కార్యక్రమంలో అస్వస్థతకు గురైన 70 ఏళ్ల వృద్ధురాలికి స్వయంగా సహాయం అందించారు. ఆమె పరిస్థితిని గమనించిన ప్రధాని వెంటనే స్పందించి, అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శుక్రవారం మైసూరులోని కాస్మోస్ ప్లానిటోరియం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు.

కిష్త్వార్ జిల్లాలో ఇద్దరు పోలీస్ అధికారుల హత్య



శ్రీనగర్,నవంబరు 14: జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారులు హత్యకు గురైన ఘటన రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ జంట హత్యల వెనక స్థానికంగా కుట్ర జరిగి ఉండొచ్చని బీజేపీ ఎమ్మెల్యే షగన్ పరిహార్ అనుమానం వ్యక్తం చేశారు. గతంలో ఆ ఇద్దరు ఎస్పీఓలకు ఒక మసీదు నుంచి బెదిరింపులు వచ్చాయని ఆమె ఆరోపించారు. ఈ బెదిరింపులపై అప్పట్లో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. భద్రతా లోపాలు, సీనియర్ పోలీస్ అధికారుల పాత్ర గురించి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఉదయనిధికి హైకోర్టులో షాక్



చెన్నై, నవంబరు 14: తమిళనాడు శాసనసభలో ప్రతిపక్ష నేత, డీఎంకే కీలక నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో చెపాక్‌తిరువల్లికేని నియోజకవర్గం నుంచి ఆయన సాధించిన విజయాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ఎన్నికల పిటిషన్‌ను ప్రాథమిక దశలోనే కొట్టివేయాలన్న ఉదయనిధి అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణ కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ, నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఉదయనిధిని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 11వ తేదీకి వాయిదా వేసింది.

ఢీకొన్న ట్యాంకర్..మిసిసిపీలో ఒరిగిపోయిన నౌక



న్యూఓర్లీన్స్, నవంబరు 14: అమెరికాలోని న్యూ ఓర్లీన్స్‌లో ఉన్న మిసిసిపీ నదిలో ఒక భయానక ప్రమాదం చోటుచేసుకుంది. ఒడ్డున నిలిపి ఉంచిన ఒక భారీ ప్యాసింజర్ క్రూయిజ్ షిప్‌ను, నియంత్రణ కోల్పోయిన మరో ట్యాంకర్ నౌక బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో క్రూయిజ్ షిప్ ఒకవైపునకు ఒరిగిపోయి, క్రమంగా నదిలో బోల్తా పడింది. ప్రాణభయంతో ప్రయాణికులు రెయిలింగ్‌లను గట్టిగా పట్టుకుని వేలాడుతూ, కొందరు నీటిలో పడిపోతున్న దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అందరినీ ఉలిక్కిపడేలా చేస్తున్నాయి.

కొలిక్కి వస్తున్న

ఉక్రెయిన్, రష్యా శాంతి చర్చలు



అబూదాబి, నవంబరు 14: రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేలా శాంతి చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చల్లో కీలక ప్రతిపాదన వచ్చినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ వెల్లడించారు. ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని డాన్‌బాస్‌పై తమ అధికారాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు బలగాలను విత్ డ్రా చేసుకుంటే, ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం కల్పించే అవకాశంపై అమెరికా చర్చల్లో ప్రస్తావించినట్లు చెప్పారు. అబుదాబీ వేదికగా అమెరికా మధ్యవర్తిత్వంతో రష్యా, ఉక్రెయిన్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, పాశ్చాత్య దేశాల నుంచి భద్రతా హామీలపై స్పష్టమైన నిర్ణయం వచ్చిన తర్వాతే ఈ ప్రతిపాదనను ఉక్రెయిన్ ప్రజల ముందు ఉంచుతానని జెలెన్స్కీ చెప్పారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడిన జెలెన్స్కీ ఉక్రెయిన్ నాటోలో చేరితే, డాన్‌బాస్ నుంచి వైదొలగడానికి సిద్ధంగా ఉంటుందా? అని అమెరికా ప్రతినిధులు తనను అడిగినట్లు ఆయన చెప్పారు. ఇలాంటి ప్రతిపాదన రావడం ఇదే తొలిసారి అని ఆయన వెల్లడించార

ఆధునిక భారత నిర్మాత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ: సిఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: దేశ తొలి ప్రధానమంత్రి, ఆధునిక భారత నిర్మాత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహానేతకు ఘనంగా నివాళులర్పించారు. నెహ్రూ జయంతి రోజున జరుపుకునే బాలల దినోత్సవం సందర్భంగా ముఖ్య మంత్రి. బాలలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.విద్య, విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు భారత ప్రగతికి బాటలు వేశాయని అన్నారు. నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమానత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్య స్ఫూర్తితో దేశ అభివృద్ధి కోసం ముందుకు సాగాలని కోరారు. ప్రతి చిన్నారిలోనూ అపారమైన ప్రతిభ, సృజనాత్మకత, నూతన ఆలోచనలు దాగి ఉంటాయని నెహ్రూ విశ్వసించేవారని గుర్తుచేశారు. బాలల హక్కులను పరిరక్షిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహిస్తూ, భయంలేని బాల్యాన్ని అందించి, వివక్షకు తావులేని సమాజాన్ని నిర్మించాలని అన్నారు. విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే నెహ్రూ ఆశయాలకు నిజమైన నివాళి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రాబోయే రోజుల్లో దేశ ప్రధాని రాహుల్

ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: ఎఐసిసి అధినేత రాహుల్ రాబోయే రోజుల్లో దేశ ప్రధానమంత్రి అవుతారని, సోనియావల్లే తెలంగాణ స్వప్నం సాకారమైందని ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డివెంకటరెడ్డి అన్నారు.శనివారం హెచ్‌ఐసిసి నోవాటెల్ వద్ద మీడియాతో మంత్రి మాట్లాడుతూ దేశం మొత్తం తెలుసు సోనియాగాంధీ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదన్నారు. తెలంగాణ దేవత సోనియా గాంధీ అని కెసిఆర్ అసెంబ్లీ సాక్షిగా అన్నాడనీ ఆయన కుటుంబంతో సహా వెళ్ళి సోనియా గాంధీ కాళ్ళు మొక్కాడనీ చెప్పారు. దేశమే నా కుటుంబం అని తిరుగుతున్న వ్యక్తి రాహుల్ గాంధీ. కెటిఆర్ లాగా తండ్రి చాటు కుమారుడు కాదు ఆయన అభివర్ణించారు. దళిత ముఖ్యమంత్రి లేకపోతే మెడమీద తలకాయ ఉండదు నాది అని ఆనాడు కెసిఆర్ అనలేదా? మాట్లాడే ముందు బిఆర్ఎస్‌వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఆలోచించుకొని మాట్లాడాలనీ అన్నారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి 10 యేళ్లు ముఖ్యమంత్రిగా కెసిఆర్ ఉన్నాడనీ ఆయనే హామీల విషయంలో 420గా వ్యవహరించారని నిందించారు. ఇలా చెప్పుకుంటూ పోతే తెలంగాణ ప్రజలను మోసం చేసింది అనేకం ఉన్నాయనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ప్రజలు ఇంటికే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వంలో బహుశా దేశంలో ఏ రాష్ట్రంలో ఇన్ని సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని చెప్పారు. రాహుల్ గాంధీ చేతుల మీదుగా గిగ్ వర్కర్ సంక్షేమం కోసం పాలసీ తీసుకొని వచ్చి పథకం అమలు చేస్తున్నామనీ దీనితో దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కాబోతున్నారనీ జోస్యం చెప్పారు.

జైళ్లశాఖ డిజిగా బాధ్యతలు స్వీకరించిన స్వాతి లక్రా



జైళ్ల శాఖ డిజిగా సౌమ్యా మిశ్రా నుంచి బాధ్యతలు స్వీకరించిన స్వాతి లక్రా

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: రాష్ట్ర జైళ్ల శాఖ డిజిగా స్వాతి లక్రా శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ డిజిగా వున్న సౌమ్యా మిశ్రా నుంచి ఆమె బాధ్య తలు తీసుకున్నారు. ఇంతకు ముందు హోంగార్డుల విభాగం డిజిగా స్వాతి లక్రా పనిచేయడం తెలిసిందే. ఆమెను అక్కడి నుంచి జైళ్ల శాఖకు గురువారం బదిలీ చేయడం తెలిసిందే. స్వాతి లక్రా బాధ్యతలు చేబట్టడంతో సౌమ్యా మిశ్రా ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. 1995 బ్యాచ్‌కు చెందిన స్వాతి లక్రా ఉమ్మడి ఎపి క్యాడర్ అధికారి. గతంలో ఆమె నగర అదనపు పోలీసు కమిషనర్ (సిట్ అండ్ క్రైం)గా పనిచేశారు. రాష్ట్రంలో షీ బృందాలు, మహిళా భద్రతా విభాగం ఆమె హయాంలోనే ఏర్పాటడంతో పాటు మహిళల భద్రతకు అనేక పథకాలు ఆచరణలో అమల్లోకి వచ్చాయి.



శనివారం నల్ల దుస్తులతో నిరసన తెలుపుతున్న బిజెవైఎం కార్యకర్తలు

రాహుల్‌ను అడ్డుకొన్న బిజెవైఎం

నల్లదుస్తులతో నిరసన తెలిపిన కార్యకర్తలు

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: తెలంగాణకు విచ్చేసిన రాహుల్ గాంధీని శనివారం ఉదయం నోవాటెల్ హోటల్ దగ్గర అడ్డుకొని నల్ల దుస్తులతో ప్లకార్డులతో బీజేవైఎం కార్యకర్తలు నిరసన తెలిపారు. తెలంగాణ పర్యటనకు విచ్చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటనను అడ్డుకొని తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్రంలో పర్యటించే హక్కు రాహుల్ గాంధీకి లేదని భారతీయ జనతా యువమోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల గడుస్తున్నప్పటికీ, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను, మేనిఫెస్టోలో ప్రకటించిన గ్యారంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంపై చిత్తశుద్ధి చూపకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పాలకవర్గం స్వప్రయోజనాలు, వ్యక్తిగత లబ్ధిపైనే దృష్టి సారిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ విద్యార్థులకు సంబంధించిన సుమారు రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు తులం బంగారం, నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, మహిళలకు స్కూటీలు, నిరుద్యోగులకు నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, ప్రతి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాల భర్తీ వంటి ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముందుగా తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ఈ హామీలన్నింటినీ అమలు చేసిన తర్వాతే రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనకు రావాలని స్పష్టం చేశారు.

యాదాద్రిలో 20 నుంచి కార్తికోత్సవం

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: యాదగిరిగుట్ట దేవస్థానం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జిల్లా యంత్రాంగం దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు కార్తికోత్సవం-2026 నిర్వహిస్తున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలోతెలిపారు. తొలిరోజున కోటి పుష్పార్చన మహోత్సవం - ఆధ్యాత్మిక ప్రవచనం - భక్తి సంగీత కార్యక్రమాలు ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో కోటి పుష్పార్చన మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.సాయంత్రం 6.00 గంటల నుండి రాత్రి 9.00 గంటల వరకు క్రింది కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఉదుగుల నాగఫణి శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం పద్మశ్రీ అవార్డు గ్రహీతలు విజయ బృందం భక్తి సంగీత విభావరి ఉంటాయి.రెండోరోజు కూడా మధ్యాహ్నం వరకు తొలిరోజు అంశాలు ఉంటాయి సాయంత్రం నుంచి రాత్రి 9వరకు ప్రముఖ సంగీత దర్శకులు ఆర్.పి. పట్నాయక్ సంగీత దర్శకత్వంలో ప్రత్యేక సంగీత విభావరిని నిర్వహించనున్నారు.మూడో రోజు కూడ మధ్యాహ్నం వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయి సాయంత్రం నుంచి రాత్రి 9వరకు మాత్రం 1. ఒడిస్సీ నృత్య ప్రదర్శన - రుద్రాక్ష ఫౌండేషన్.2 తెలంగాణ ఆలయాల వైభవంపై ప్రత్యేక నృత్య రూపకం - పరంపర సంస్థ ఆధ్వర్యంలో అభినేత్రి బృందం. 3. పేరిణి నృత్య ప్రదర్శ - కళాకృష్ణ బృందంతో భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాలతో పాటు తెలంగాణ రాష్ట్ర విశిష్ట కళా, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే వైవిధ్యభరితమైన నృత్య ప్రదర్శనలతో ఉత్సవాలు ముగింపును నిర్వహించనున్నారు.

పంచశీలతో ప్రపంచశాంతికి తోడ్పడిన నెహ్రూ

గాంధీ భవన్‌లో ఘనంగా జవహర్‌లాల్ 137వ జయంతి

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: దేశస్వాతంత్ర సముపార్జనకు కీలకపాత్రపోషించిన నెహ్రూ దేశాధినేతగా అభివృద్ధిసంక్షేమం కోసం పాటుపడుతూనే మరోవైపు పంచశీలతో ప్రపంచ శాంతికి తోడ్పాటు అందించి విశ్వవ్యాప్తంగా భారత్ కీర్తి పతాకం ఎగురవేశారని గత చరిత్రను గుర్తుచేసు కొంటూ జవహర్‌లాల్‌నెహ్రూకు 137 జయంతి సందర్భంగా నివాళ్ళు అర్పించారు. భారత తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆధునిక భారతదేశ నిర్మాణానికి పునాదులు వేసిన భారతరత్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 137వ జయంతి వేడుకలను గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించారు. గాంధారి ప్రభాకర్ కన్వీనర్‌గా వ్యవహరించి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాంధీ సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ కుమార్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీ నాయకత్వంలో అత్యంత చురుకుగా పాల్గొని, అనేక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ పలుమార్లు జైలు జీవితాన్ని సైతం అనుభవించారని పేర్కొన్నారు. స్వాతంత్రం అనంతరం భారతదేశ తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, దేశ అభివృద్ధికి పటిష్టమైన పునాదులు వేశారని తెలిపారు.



శనివారం గాంధీ భవన్‌లో జరిగిన నెహ్రూ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు: చాచా నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు నెహ్రూ జీవిత చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమం, జాతీయ నాయకుల త్యాగాలు, భారతదేశ అభివృద్ధి వంటి అంశాలపై ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు.ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, కార్యక్ర మంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

నెహ్రూ జీవిత విశేషాలతో ప్రత్యేక ఫోటో గ్యాలరీ: ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జీవితంలోని ముఖ్య ఘట్టాలు, స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న సంఘ టనలు, జాతీయ నాయకులతో ఆయన అనుబంధం, స్వాతంత్రం అనంతరం ఆయన నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే అరుదైన చిత్రపటాలతో ప్రత్యేక ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు సామూహిక ప్రతిజ్ఞ: భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, భారత రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాలని కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి యానాల ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కే శ్రీనివాస్ రెడ్డి ,ఎన్ దయాకర్ రెడ్డి, కార్యదర్శి కే సుభాష్ చంద్ర,సలహాదారులు వి సాంబశివరావు, కోటిరెడ్డి, ధర్మేంద్ర జగన్మోహన్ రెడ్డి, ప్రతినిధులు బి పవన్ జె సతీష్ నరేష్ శేఖర్ హరీష్ మరియు టి పి సి సి ప్రతినిధులు అల్లం భాస్కర్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్, సెంటుమేరియా హై స్కూల్, శాంతినికేతన్ హైస్కూల్, బచ్పన్ హైస్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు, యాజమాన్యాలు పాల్గొన్నారు. 137 మంది నెహ్రూ వేషధారణలో బాలురు అందరినీ ఆకర్షించారు.

ఎమ్మెల్సీలుగా పదవీ విరమణ చేసిన గోరేటి వెంకన్న, సారయ్య, దయానంద్‌లకు ఘన సన్మానం

శాసన మండలి సభ్యులుగా విశేష సేవలు అందించారు: చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: గవర్నర్ కోటాలో శాసన మండలి సభ్యులుగా నియమితులై, పదవీ విరమణ పొందిన గోరేటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌లను తెలంగాణ శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ శాసన మండలి సభ్యులుగా గోరేటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్ తమ పదవీకాలంలో విశేష సేవలు అందించారని కొనియాడారు. ప్రజా సమస్యలను శాసన మండలి వేదికగా ప్రస్తావిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేశారని తెలిపారు. గవర్నర్ కోటాలో శాసన మండలికి వచ్చిన ఈ ముగ్గురు సభ్యులు విభిన్న రంగాల్లో విశేష అనుభవం కలిగిన వ్యక్తులని పేర్కొన్నారు. తమ అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని శాసన మండలి కార్యకలాపాల్లో వినియోగించి సభ గౌరవాన్ని మరింత పెంచారని అన్నారు. ప్రజా గాయకుడిగా గోరేటి వెంకన్న తెలంగాణ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. తన పాటల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానం, సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని కొనియాడారు. ప్రజా కళాకారుడిగా ఆయన అందించిన సేవలు ఎంతో విలువైనవని అన్నారు. బొగ్గారపు దయానంద్ ప్రభుత్వ ఉద్యోగిగా సుదీర్ఘకాలం సేవలు అందించి, పదవీ విరమణ అనంతరం కూడా ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేశారని తెలిపారు. ప్రభుత్వ పరిపాలనలో ఉన్న అనుభవంతో శాసన మండలిలో వివిధ అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారని పేర్కొన్నారు. బస్వరాజు సారయ్య సామాన్య స్థాయి నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, కౌన్సిలర్‌గా, శాసన సభ్యుడిగా, మంత్రిగా, శాసన మండలి సభ్యుడిగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవలు అందించారని తెలిపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. "ఈ ముగ్గురు సభ్యులు నేడు శాసన మండలి సభ్యులుగా మాత్రమే పదవీ విరమణ పొందుతున్నారు. ప్రజాసేవ నుంచి మాత్రం పదవీ విరమణ పొందడం లేదు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పానికి పదవులతో సంబంధం లేదు. భవిష్యత్తులో కూడా వీరు తమ అనుభవాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని కోరుకుంటున్నాను" అని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.



పదవీ విరమణ చేసిన ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న స్పీకర్‌ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్ రెడ్డి

శాసన మండలిలో సభ్యుల మధ్య రాజకీయాలకు అతీతంగా స్నేహపూర్వక వాతావరణం ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పదవీకాలంలో కలిసి పనిచేసినసభ్యులు పదవీ విరమణ పొందడం కొంతభావోద్వేగానికి గురిచేస్తుందని అన్నారు. పదవీ విరమణ పొందుతున్న ముగ్గురు సభ్యులు సంపూర్ణ ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో వారి ప్రయాణం నిరంతరం కొనసాగాలని కోరుకుంటూ ముగ్గురికీ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి విప్‌బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, కోటిరెడ్డి, అంజిరెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఏవీఎన్ రెడ్డి, భాను ప్రసాదరావు, శాసన మండలికార్యదర్శి డా.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్.తిరుపతి,ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నశా ముక్త్ తెలంగాణలో రెడ్‌క్రాస్ క్రియాశీలక పాత్ర పోషించాలి

వికసిత్ భారత్ -2047లో యువత భాగస్వామ్యం కీలకం

68వేల మంది కొత్త సభ్యుల చేరికపై గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అభినందన

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త:మాదకద్రవ్య రహిత తెలంగాణ నిర్మాణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్రియాశీలక పాత్ర పోషించాలని గవర్నర్ , ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమైన వికసిత్ భారత్-2047 సాధనలో యువత భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.లోక్‌భవన్‌లో శనివారం రెడ్‌క్రాస్ సొసైటీకి నూతనంగా ఎన్నికైన 29 జిల్లాల చైర్మన్లు, చైర్‌పర్సన్లు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులతో గవర్నర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థ చేపట్టాల్సిన మూడు ప్రధాన కార్యక్రమాలపై గవర్నర్ దిశానిర్దేశం చేశారు. కేవలం మూడున్నర నెలల్లో 68 వేల మంది కొత్త సభ్యులను చేర్చుకోవడం అభినందనీయమని గవర్నర్ అన్నారు. రాష్ట్ర శాఖ ఏర్పాటైనప్పటి నుంచి ఉన్న మొత్తం సభ్యత్వం 60 వేలుగా ఉండగా, ఒక్క ప్రత్యేక డ్రైవ్‌లోనే మరో 68 వేల మందిని చేర్చుకోవడం విశేషమన్నారు. ఈ కృషికి నాయకత్వం వహించిన రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ చైర్మన్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్‌తో పాటు జిల్లా శాఖల ప్రతినిధులను అభినందించారు. ఇదే స్ఫూర్తి తో కొత్త కార్యవర్గం మరింత మందిని కొత్తగా సభ్యులుగా చేర్చేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ సభ్యత్వాన్ని పెంచేందుకు డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు.ఇప్పటికే నమోదైన 2,078 మంది ఆపద మిత్ర వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జనవరి12న వివేకానంద అవార్డులు

సేవా కార్యక్రమాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యాసంస్థలకు రెడ్‌క్రాస్-లోక్‌భవన్ వివేకానంద యూత్ అవార్డులు అందజేయనున్నట్లు గవర్నర్ ప్రకటించారు. ప్రతిజిల్లా నుంచి రెండు ఉన్నత పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాల, ఒక డిగ్రీ, ఇంజినీరింగ్ లేదా మెడికల్ కళాశాలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.వచ్చే ఏడాది జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. అంతకు ముందు గవర్నర్ సమక్షంలో రెడ్‌క్రాస్ సొసైటీకి కొత్తగాఎన్నికైన రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులతో రెడ్‌క్రాస్ రాష్ట్రశాఖ చైర్మన్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ స్టేట్‌లలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు లోక్‌భవన్ వేదికగా ప్రమాణం చేయడం ఇదేమొదటిసారి. అనంతరం రెడ్ క్రాస్‌ప్రచార పోస్టర్‌లను గవర్నర్ ఆవిష్కరించారు.



ధాన్యం కొనుగోళ్లు, పారదర్శకత, జవాబుదారీతనంపై ప్రధాన దృష్టి

పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా వై.నాగిరెడ్డి బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరగడమే తన మొదటి ప్రాధాన్యత అని పౌరసరఫరాలశాఖ కమిషనర్ వై.నాగిరెడ్డి చెప్పారు.తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, అలాగే తూనికలు కొలతల శాఖ కంట్రోలర్‌గా వై.నాగిరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు, కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించడం, నిల్వ చేయడంపై దృష్టి పెడతామన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సరైన తూకం, పారదర్శకమైన రికార్డులు నిర్వహించడంతో పాటు రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖకు రైతులు, రేషన్ కార్డుదారులు, వినియోగదారుల పట్ల ఎంతో బాధ్యత ఉందన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, సమయానికి సేవలు అందించడమే ఈ శాఖ ప్రధాన లక్ష్యాలని ఆయన పేర్కొన్నారు.కస్టమ్ మిల్లింగ్ గురించి మాట్లాడుతూ రైస్ మిల్లులకు ఇచ్చిన ధాన్యం ప్రభుత్వ ఆస్తి అని, ప్రతి గింజకు లెక్క ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. మిల్లుల వారీగా ఉన్న బకాయిలపై సమీక్ష జరుపుతా మన్నారు. నిజమైన సమస్యలు ఉంటే పరిశీలించి పరిష్కరిస్తామని, అయితే ఉద్దేశపూర్వకంగా ధాన్యం పక్కదారి పట్టించినా, తప్పుడు లెక్కలు చూపినా, పదేపదే తప్పులు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం నడుచుకునే మిల్లర్లను ప్రోత్సహిస్తామన్నారు.

రేషన్ కార్డుల్లో తప్పులు సరిదిద్ద డం, కొత్త దరఖాస్తులను త్వరగా పరిష్కరించడం, నిత్యావసర సరుకులు పక్కదారి పట్టకుండా చూడటంపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు.సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌లో ఆర్థిక క్రమశిక్షణ, పనితీరు మెరుగుపడాలని కమిషనర్ నొక్కి చెప్పారు. కొనుగోళ్లు, నిల్వ, రవాణా, రేషన్ పంపిణీ అంతా పక్కాగా జరగాలన్నారు. ట్రాన్స్‌పోర్టర్లు, గోదాముల నిర్వాహకులు, రేషన్ డీలర్లు ఇతర సిబ్బంది తమ బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించాలని సూచించారు.వినియోగదారుల హక్కుల గురించి మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు, లభ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని, బ్లాక్ మార్కెటింగ్ లేదా అక్రమ నిల్వలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ పంపిణీలో కూడా ఎలాంటి అక్రమాలు జరగకుండా చూస్తామన్నారు.తూనికలు కొలతల శాఖ ద్వారా వినియోగదారులకు వారు చెల్లించిన డబ్బుకు సరిపడా సరుకు అందేలా చూస్తా మన్నారు. ముఖ్యంగా పెట్రోల్ బంకుల్లో, ప్యాకింగ్ చేసిన వస్తువుల విషయంలో కచ్చితమైన కొలతలు ఉండేలా చర్యలు తీసుకుంటామని, అదే సమయంలో నిజాయితీగా వ్యాపారం చేసుకునే వారికి మద్దతుగా ఉంటామని తెలిపారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వాస్తవ పరిస్థితులను మాత్రమే రిపోర్ట్ చేయాలని సూచించారు.

ప్రభుత్వ శాఖల్లో వారానికి ఐదు రోజుల పని

అదనంగా మరో గంటన్నర పాటు పనివేళలు పెంపు

పనిదినాలు కుదించే ఆలోచనలో రాష్ట్ర సర్కార్

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: ప్రభుత్వ ఆఫీసుల్లో పనిదినాలను కుదించి వాటి స్థానంలో వారానికి 5 రోజులు మాత్రమే వర్కింగ్ డేస్ అమల్లోకి తీసుకువచ్చే దిశగా కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న 6 రోజుల పనిదినాల విధానానికి బదులుగా కేవలం 5 రోజులే విధులు నిర్వహించి, మిగిలిన రెండు రోజులు శనివారం, ఆదివారం సెలవు ప్రకటించే అంశంపై ఉన్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉద్యోగులు వారానికి 6 రోజులు పనిచేస్తూ, ప్రతిరోజూ 8 గంటల చొప్పున మొత్తం 48 గంటలు సేవలందిస్తున్నారు. అయితే, కొత్తగా పరిశీలిస్తున్న ప్రతిపాదన ప్రకారం పనిదినాలను 5 రోజులకు తగ్గించి, ప్రతిరోజూ అదనంగా మరో గంటన్నర పాటు పనివేళలను పెంచే ఆలోచనలో ఉన్నట్ల

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌కు వస్తున్న పాక్ మంత్రి



న్యూఢిల్లీ, నవంబరు 14: భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాకిస్తాన్ మంత్రి భారత పర్యటనకు రాబోతున్నారు. ఆ దేశ వాతావరణ మార్పుల శాఖ మంత్రి డాక్టర్ ముసాదిక్ మసూద్ మాలిక్ నవంబర్ 20 నుంచి 22 వరకు న్యూఢిల్లీలో జరగనున్న షాంఘై సహకార సంస్థ సివిలైజేషనల్ డైలాగ్‌లో పాల్గొననున్నారు.ఈ విషయాన్ని పాకిస్తాన్ విదేశాంగ శాఖ నవంబర్ 14న అధికారికంగా ప్రకటించింది. 2025 మేలో ఆపరేషన్ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన ఒక కేంద్ర మంత్రి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.దీనికి ముందు 2023లో అప్పటి పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ గోవాలో జరిగిన ఎస్‌సీవీదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన కేంద్ర మంత్రి భారత్‌లో పర్యటించలేదు. ఎస్‌సీవోలో సభ్యత్వం ఉన్న దేశాలన్నింటికీ ఈ సమావేశానికి ఆహ్వానాలు పంపినట్లు భారత్ అక్టోబర్ 28న ప్రకటించింది. పాకిస్థాన్‌తో పాటు మొత్తం పది ఎస్‌వో సభ్య దేశాలను భారత్ ఆహ్వానించింది. ఈ కార్యక్రమం ద్వారా సభ్య దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు, నాగరికత వారసత్వంపై చర్చలకు అవకాశం కల్పించాలనేదే దీని ఉద్దేశం. పాకిస్తాన్ ఈ సమావేశానికి ఎవరిని పంపుతారనే దానిపై ముందు స్పష్టత లేదు, తాజాగా ఆ దేశం ముసాదిక్ మాలిక్ పేరును ప్రకటించింది.

తెలంగాణలో పాలసీ పెరాలసిస్ లేదు

పెట్టుబడులకు సంపూర్ణ భద్రత: సిఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, రాష్ట్రంలో విధానపరమైన గందరగోళం లేదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు పాలసీ పెరాలసిస్ లేదని, పెట్టుబడులకు అవసరమైన భూములు, నీళ్లు, అనుమతులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక విధానాలు రూపొందించామని చెప్పారు. విద్య, వైద్యం, పరిశ్రమలు, సేవారంగాల్లో రాష్ట్రాన్ని అం తర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తెలంగాణకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడంతో పాటు హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడంలో ఐఎస్‌బీ, నల్సార్ వంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం అన్నారు. శనివారం సాయంత్రం పబ్లిక్ హెల్త్ సైన్సెస్ సంస్థ(పిహెచ్ఎఫ్ఐ) క్యాంపస్ నిర్మాణ పనుల మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగం లోనూ హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చేందుకు పీహెచ్ ఎఫ్ఐ వంటి సంస్థలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించుకున్నామని, మిగతా టిమ్స్ ఆస్పత్రులను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రిని కొత్తగా నిర్మిస్తున్నామని, ఆస్పత్రుల అభివృద్ధి కోసం మొత్తం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. దేశంతో పాటు మధ్యప్రాచ్య, ఆసియా దేశాలు కూడా పెట్టుబడుల కోసం హైదరాబాద్ వైపు చూస్తున్నాయని చెప్పారు. గత నాయకులు తీసుకున్న దూరదృష్టితో కూడిన నిర్ణయాలే నేటి హైదరాబాద్ అభివృద్ధికి పునాదులని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశంలో అక్షరాస్యత కేవలం 12 శాతం మాత్రమే ఉండేదని, ఆహార కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని, ఐఐటీ ఖరగ్‌పూర్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలకు పునాదులు వేశారని చెప్పారు. శ్రీశైలం, భాక్రా నంగల్ వంటి ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయానికి నీటి వసతి పెరిగిందని, దేశం ఆహార కొరత నుంచి మిగులు ఆహార ధాన్యాల స్థాయికి చేరుకుందని వివరించారు. రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన సాంకేతిక మార్పులు దేశంలో సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి బాటలు వేశాయని సీఎం అన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్న అనేక మంది విద్యార్థులు ప్రపంచంలోని ప్రముఖ ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. దేశంలోని ప్రతి గ్రామానికి విద్య చేరినా, నాణ్యమైన విద్య అందించడంపై ఇంకా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణ పిల్లలు... ప్రపంచంతో పోటీ పడాలి: సీఎం రేవంత్: తెలంగాణలోని మారుమూల గ్రామంలో ఉన్న విద్యార్థి కూడా న్యూయార్క్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో పనిచేసే వారితో పోటీపడే స్థాయికి ఎదగాలని రాష్ట్ర సీఎం రేవంత్ ఆకాంక్షించారు. పీవీ నరసింహారావు తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశానికి కొత్త దిశ చూపాయని చెప్పారు. రాష్ట్రంలో గతంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి, కేసీఆర్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన మంచి విధానాలను తమ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందన్నారు. రాజకీయంగా, వ్యక్తిగతంగా విభేదాలు ఉండవచ్చని, కానీ అభివృద్ధికి ఉపయోగపడే విధానాలను మాత్రం కొనసాగించాలన్నదే తమ అభిప్రాయమని స్పష్టం చేశారు. తెలంగాణను 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను రూపొందించామని సీఎం తెలిపారు. హైదరాబాద్‌కు ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తూ ఈ ప్రాంతాన్ని సేవారంగానికి కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు అవతల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, 160 కిలోమీటర్ల రహదారికి టెండర్లు పిలిచామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ సుమారు 10 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో తయారీ రంగాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆదాయంలో సుమారు 65 శాతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచే వస్తోందని సీఎం తెలిపారు. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాగా రంగారెడ్డి నిలిచిందని చెప్పారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి చేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఫ్లోరైడ్ సమస్యతో పాటు మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పుట్టబోయే పిల్లల ఆరోగ్యంపై కూడా దుష్ప్రభావం పడుతోందని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని, నల్గొండ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలంటే మూసీ శుద్ధి తప్పనిసరని స్పష్టం చేశారు. పీహెచ్ఎఫ్ఐ ప్రాజెక్టును 2028 జూన్ 2 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎం తెలిపారు. ఈ సంస్థ ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. పీహెచ్ఎఫ్ఐ హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించడమే కాకుండా, తాను స్వయంగా బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు.



శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రజా ఉద్యమం

25 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో నషా ముక్త్ భారత్ యాత్ర: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 14, ప్రభాతవార్త: మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి యువతను కాపాడి, దేశాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు, గనులశాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్ష మేరకు 2029 నాటికి దేశాన్ని నషా ముక్త్ భారత్‌గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు తొలి విడత నషా ముక్త్ భారత్ యాత్ర నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ యాత్ర సన్నాహాల్లో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో మేధావులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన లఘు నాటిక డ్రగ్స్‌కు బానిసలై యువత జీవితాలు ఎలా నాశనమవు తున్నాయో కళ్లకు కట్టింది. అనంతరం పాల్గొన్న వారంతా డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన భారత్‌కు యువతే అతిపెద్ద ఆస్తి అని, యువత మాదకద్రవ్యాలకు బానిసైతే దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. అంతర్జాతీయ శక్తులు నేరుగా యుద్ధం చేయలేక, ఆర్థిక ఆంక్షలతో భారత్‌ను అడ్డుకోలేక డ్రగ్స్‌ను ఆయుధంగా మలుచుకుని యువతను నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. గతంలో ఉగ్రవాదం ద్వారా దేశాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించిన శక్తులు ఇప్పుడు మాదకద్రవ్యాలను అక్రమంగా పంపిస్తూ పరోక్ష యుద్ధానికి తెరతీస్తున్నాయని ఆరోపించారు. గత పన్నెండేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అనేక రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందని చెప్పారు. దేశ భద్రత, తయారీ, ఎగుమతులు, మౌలిక వసతులు, రైల్వేలు, రైతుల సంక్షేమం, మహిళా సాధికారత వంటి రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా దేశాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన అనేది ప్రభుత్వం, పోలీసులు లేదా ఒక రాజకీయ పార్టీకి మాత్రమే సంబంధించిన అంశం కాదని, 140 కోట్ల మంది భారతీయుల సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. కళాకారులు, సినీ ప్రముఖులు, క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలు, మీడియా ప్రతినిధులు, విద్యాసంస్థలు, మేధావులు ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి, విశ్రాంత మేజర్ జనరల్ వి.ఆర్. మహేంద్ర, డాక్టర్ సిద్ధార్థరెడ్డి, జేఎన్‌టీయూ ప్రతినిధి కిషన్‌కుమార్‌రెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలపై ఐక్యపోరాటం

ప్రతి పౌరుడికి ఓటుహక్కు ఉండాలి, నియంతృత్వ శక్తులు తమకు నచ్చిన వర్గాలకే ఆ హక్కు కల్పిస్తున్నాయి: భారత్ సమ్మిట్‌లో సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులంతా ఏకమై కలిసికట్టుగా పోరాటం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపం చవ్యాప్తంగా చాలా దేశాల్లో ప్రజల్లో వ్యక్తమవుతున్న కలలు, ఆకాంక్షలను అర్థం చేసుకుని, వాటిని నెరవేర్చడానికి మనమంతా చేతులు కలపాలని ప్రజాస్వామ్యవాదులను కోరారు. హెచ్‌ఐసీసీలో రెండు రోజుల పాటు జరిగిన భారత్ సమ్మిట్ -2026 ముగింపు సమావేశంలో శనివారం ముఖ్యమంత్రి 'డెలివరింగ్ గ్లోబల్ జస్టిస్' అన్న అంశంపై ప్రసంగించారు.

జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సులో ముఖ్య మంత్రి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఒకే ఆలోచనా ధోరణి కలిగిన ప్రతినిధులు, ప్రభావశీలురను ఒకచోటికి తీసుకురావడానికి భారత్ సమ్మిట్ గొప్ప వేదికగా నిలుస్తోందని అన్నారు. 'ప్రస్తుతం ప్రపంచంలో ప్రధానంగా రెండు శక్తుల మధ్య పోరాటం సాగుతోంది. ఒక శక్తి ప్రజాస్వామ్య పరిరక్షణను కోరుకుంటే మరో శక్తి ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయాలని చూస్తోంది. రాజ్యాంగం, చట్టబద్ధ పాలనకు కట్టుబడి మనముంటే, రాజ్యాంగాన్ని విధ్వంసం చేసి నియంతృత్వాన్ని రుద్దాలని ఆ శక్తులు ప్రయత్నిస్తున్నాయి' అని పేర్కొన్నారు. 'ప్రతి పౌరుడికి ఓటుహక్కు ఉండాలని కోరుకుంటే, నియంతృత్వ శక్తులు తమకు నచ్చిన కొన్ని వర్గాలకే ఆ హక్కు కల్పించాలని భావిస్తు న్నాయి. మనమంతా పర్యావరణ పరిరక్షణ కోరుకుంటే, ఆ శక్తులు పర్యావరణ వినాశనాన్ని కోరుకుంటున్నాయి. పేదలు, మహిళలు, మైనారిటీలు, రైతులతో సహా ప్రతి ఒక్కరినీ రక్షించాలని మనమంతా భావిస్తుంటే, వాళ్లు మిలియనీర్(సంపన్న మిత్రులను) మిత్రులను మాత్రమే కాపాడుకోవాలన్న తాపత్రయాన్ని ప్రదర్శిస్తున్నారు' అని పేర్కొన్నారు. 'అందరికీ సమాన అవకాశాలు కాకుండా అధికారం కొందరి చేతుల్లోనే కేంద్రీకృతం కావాలని ఆశిస్తున్నారు. మేము చర్చలు,సంప్రదింపులను కోరుకుంటు న్నాం, కానీ వారు ఒకే వ్యక్తి నుంచి ఆదేశాలు రావాలని కోరుకుంటున్నారని కేంద్రంలోని బిజెపి తీరుపై విమర్శలు చేశారు. ఈ పరిస్థితుల్లో మనపై ఎంతో గొప్ప బాధ్యత ఉంది. అందరం కలిసికట్టుగా పోరాడితే విజయం సాధిస్తాం' అని ధీమా వ్యక్తం చేశారు. మన నాయకుడు రాహుల్ గాంధీ దేశంలో ఈ పోరాటానికి నాయకత్వం వహిస్తున్నారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం కోసం ఆయన పోరాడుతున్నారు. దళితులు, మైనారిటీలు,ఓబీసీలకు సామాజిక న్యాయం కల్పించడం కోసం ఆయన పోరాటం చేస్తున్నారు' అని చెప్పారు.ఈ పోరాటంలో మనమందరం రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలవాలి. ఆయన నాయకత్వంలో మనం ఈ మార్పును తీసుకువస్తాం అని చెప్పారు.సంపన్నుల కోసం పనిచేయడం మానుకోవాలి. ప్రభుత్వాలు సామాన్య ప్రజల కోసం పనిచేయాలి" అని ముఖ్య మంత్రి ఉద్ఘాటించారు. ప్రపంచ వ్యాప్తంగా మనమందరం ఒకే రకమైన సమస్యలను ఎదొ ర్కొంటున్నాం. అందరం కలిసి పోరాడుదాం, రాహుల్ నాయకత్వంలో ఈ ఆలోచనలతో మన దేశాన్ని కాపాడుకుందాం' అని పిలుపునిచ్చారు.

'ఈ సదస్సుకు 70 దేశాల నుంచి దాదాపు వెయ్యి మందికి పైగా ప్రతినిధులను ఆహ్వానించాం. కేంద్ర ప్రభుత్వం కొందరికి వీసాలను నిరాకరించింది. అయినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వారంతా ఈ కార్యక్రమాన్ని వీక్షి స్తున్నారని విశ్వసిస్తున్నాం' అని చెప్పారు. 'భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున ఈ సమ్మిట్ నిర్వహించుకోవడం ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. దేశంలో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వ్యవస్థ బలోపేతం కావడానికి నెహ్రూ దార్శనికత ఎంతో దోహదపడింది' అని ముఖ్యమంత్రి వివరించారు.

కవిత పార్టీ కాంగ్రెస్ పార్టీలో భాగమే: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ మాదిరిగా టీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ పార్టీలో భాగమేనని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. టీఆర్ఎస్ అంటే తెలంగాణ రక్షణ సేన్న కాదని, తెలంగాణ రేవంత్ సైన్యం అని కవిత పార్టీపై విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఈగ కూడా వాలకుండా కంటికి రెప్పలా కాపాడుతున్న సైన్యమే టీఆర్ఎస్ అని, దానికి నాయకురాలు కవిత అని ఆరోపించారు.శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి సౌజన్యంతో పాంచజన్యం ఎజెండాతో కవిత టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేశారని ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు బయటపెడతానని అన్నారు. కవితను బిఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరించినందుకు కేసీఆర్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఐపిఎస్ అధికారి రాజీవ్ హనుమంతు

ఫోన్‌లో పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం చాపరాళ్లపల్లి సమీపంలో కారు,స్కూల్ బస్సు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారులో తిరుపతి నుంచి శ్రీశైలం వెళ్తున్న తెలంగాణ రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఐజీ రాజీవ్ హనుమంతు,ఆయనతో పాటు పిల్లలు సరయు,ప్రేరణదేవికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆసుపత్రికి చేరుకుని అధికారిని పరామర్శించారు. కాగా, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజీవ్ హనుమంతును ఫోన్‌లో పరామర్శించారు. తిరుమల నుంచి శ్రీశైలం వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజీవ్ హనుమంతుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు గాయపడిన విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే స్పందించారు. ఫోన్‌లో రాజీవ్ హనుమంతుతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును, ప్రస్తుతం ఆయనతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రాజీవ్ హనుమంతు కుటుంబ సభ్యులకు మంత్రి ధైర్యం చెప్పారు. ఆందోళన చెందవద్దని, అవసరమైన మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, వైద్యచికిత్స విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తనదృష్టికి తీసుకురావాలని మంత్రి భరోసా ఇచ్చారు. రాజీవ్ హను మంతు,ఆయన కుటుంబసభ్యులు త్వరగాకోలుకోవాలని మంత్రి ఆకాంక్షి ంచారు.

మంత్రిసభలో పక్కన వ్యక్తిని ముద్దాడిన బిజెపి ఎమ్మెల్యే

భువనేశ్వర్, నవంబరు 14: మీడియా సమావేశంలో మంత్రి ప్రసంగిస్తుండగా ఒక బీజేపీ ఎమ్మెల్యే తన పక్కన ఉన్న వ్యక్తిని ముద్దు పెట్టుకున్నారు. అతడిని కౌగిలించునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లుగా ఉన్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అది ఏఐ వీడియో అని ఆ ఎమ్మెల్యే భార్య ఆరోపించారు. బీజేపీ పాలిత ఒడిశాలో ఈ సంఘటన జరిగింది. గురువారం గంజాం జిల్లాలో వరద ప్రభావంపై మత్స్య, పశు వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గోకులానంద మాలిక్ మీడియాతో మాట్లాడారు. 2024లో మొదటిసారి అసెంబ్లీకి ఎన్నికైన చికితీ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సమంత్రా, ఆ మంత్రి వెనుక నిల్చొని ఉన్నారు. అయితే పక్కనే ఉన్న వ్యక్తిని ముద్దు పెట్టుకోవడానికి, కౌగిలించుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నట్లుగా ఉన్న ఒక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఒడిశాలోని ప్రతిపక్ష బీజేడీ ఈ వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో షేర్ చేసింది. గంజాం జిల్లా వరదల్లో మునిగిపోతుంటే, బీజేపీ నాయకులు మాత్రం ఆనందంతో గెంతుతున్నారు అని విమర్శించింది. అయితే బీజేపీ అధికార ప్రతినిధితో పాటు ఆ ఎమ్మెల్యే కూడా ఈ వీడియో క్లిప్‌పై స్పందించలేదు. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సమంత్రా భార్య మీనా సాహు ఈ వీడియోపై స్పందించారు. వైరల్ అవుతున్న ఈ క్లిప్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి మార్ఫింగ్ చేశారని ఆమె ఆరోపించారు. అదే విలేకరుల సమావేశానికి సంబంధించిన మరో వీడియోను ఎక్స్‌లో షేర్ చేశారు. అదే అసలైన ఫుటేజ్ అని, మంత్రి ప్రసంగాన్ని ఎమ్మెల్యే చాలా శ్రద్ధగా వింటున్నారని ఆమె పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సమంత్రా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఏఐ సాంకేతికతతో సృష్టించిన వీడియో క్లిప్‌ను బీజేడీకి చెందిన చికితీ సోషల్ మీడియా బృందం ప్రచారం చేస్తోందని ఆయన భార్య మీనా ఆరోపించారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బెర్హంపూర్ పోలీసులను ఆమె కోరారు.

ఎపి పంచాయతీ ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్లు

అమరావతి,నవంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:పంచాయతీ ఎన్నికల మొదటి దశకు నామినేషన్ల స్వీకరణ రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఈ మొదటి దశలో తిరుపతి జిల్లాలో అత్యధికంగా 404 పంచాయతీలు ఉండగా, అల్లూరి జిల్లాలో అత్యల్పంగా 66 పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 13,167 సర్పంచ్ స్థానాలకు, 132,514 వార్డు సభ్యుల స్థానాలకు మూడు దశల్లో పోలింగ్ జరగనుంది. రెండో, మూడో దశలకు సంబంధించిన నోటిఫికేషన్లు వరుసగా ఈ నెల 16, 19 తేదీల్లో విడుదలవుతాయి. మొదటి దశ పరిధిలోకి వచ్చే 3,967 పంచాయతీలకు ఈ నెల 15 నుంచి ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 18వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నిబంధనలకు అనుగుణంగా లేని నామినేషన్లను తిరస్కరిస్తారు. నామినేషన్ల తిరస్కరణకు గురైన అభ్యర్థులు, అదే రోజు సాయంత్రం 5:00 గంటలలోపు అర్డీఓ (రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్) వద్ద అప్పీలు చేసుకోవచ్చు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు గడువు ఉంటుంది. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత, అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. ఈ నెల 26న 3,967 సర్పంచ్ స్థానాలకు, 40,012 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరుగుతుంది.

భారత్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్: రాహుల్ మధ్యలోనే వెళ్లిపోయారు

నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్,నవంబరు14,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించిన భారత్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యా నించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భారత్ సమ్మిట్ స్టేజీ నుండి మధ్యలోనే వెళ్లిపోవడమే నిదర్శన మన్నారు. భారత్ లో ప్రజాస్వామ్యం ధ్వంసమైం దంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపైనా బండి సంజయ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజాస్వామ్యమంటే ఒకే కుటుంబం దశాబ్దాల పాటు దేశాన్ని పాలించడమా? ఒకే కుటుంబం పార్టీని చెప్పు చేతల్లో పెట్టుకోవడమే రాహుల్ మార్క్ ప్రజాస్వామ్యమా? ఎమర్జెన్సీ పేరుతో రాజ్యాంగ హక్కులను కాలరాచిన కాంగ్రెస్ ఫాసిజం గురించి మాట్లాడమా? 3 వేల మంది సిక్కులను ఊచకోత కోసినప్పుడు ఫాసిజం గుర్తుకు రాలేదా?అంటూ దుయ్యబట్టారు. భారత్ సమ్మిట్ ముగిసిన అనంతరం రాహుల్ తీరుపైనా, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ కేంద్ర మంత్రి మీడియాకు వీడియోను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో



నిర్వహించిన భారత్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భారత్ సమ్మిట్ స్టేజీ నుండి మధ్యలోనే వెళ్లిపోవడమే నిదర్శనం. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకే కాదు, ప్రపంచ దేశాలు సైతం కాంగ్రెస్ మోసాలను గ్రహించాయి. ఆ పార్టీని పట్టించుకోవడం లేదన డానికి నిదర్శనమిది. ప్రపం

ఆట

ఆసియా కప్ ఛాంపియన్‌గా భారత్

పాక్ గెలుపు ఖాయమనుకున్న వేళ చిత్తు

చివరి బంతికి ఫోర్ కొట్టి ఓడించిన మోహిత్



ఒమన్: ఒమన్ గడ్డపై యువ భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఏసీసీ పురుషుల అండర్19 ఆసియా కప్ 2026 ఫైనల్ పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారత్ ఒక్క వికెట్ తేడాతో నరాలు తెగే ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. 338 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా అండర్19 ఆసియా కప్ చరిత్రలోనే అత్యుత్తమ లక్ష్య ఛేదనలలో ఒకటిగా నిలిచే అద్భుత విజయాన్ని నమోదు చేసి 10వ సారి ఛాంపియన్‌గా అవతరించింది. అల్ అమెరాత్ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన ఈ టైటిల్ పోరులో మ్యాచ్ ఆరంభం నుంచి చివరి క్షణం వరకు ఇరు జట్లు టైటిల్ కోసం అంగుళం కూడా వదలకుండా హోరాహోరీగా తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ కెప్టెన్ ఫర్హాన్ యూసుఫ్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. నిర్ణీత 50 ఓవర్లలో పాకిస్థాన్ 9 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు చేసింది. పాకిస్థాన్ తరఫున ఉస్మాన్ ఖాన్ అతిపెద్ద ఇన్నింగ్స్‌తో 107 పరుగులు చేయగా, మిడిలార్డర్లో అబ్దుల్ ఖాదిర్ (80) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ ఫర్హాన్ యూసుఫ్ (63) అర్ధ సెంచరీ చేశాడు. భారత్ తరఫున కావ్య పటేల్ అత్యంత విజయవంతమైన బౌలర్‌గా నిలిచి 10 ఓవర్లలో 68 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు చిగురుపాటి వెంకట్ 5 ఓవర్లలో 40 పరుగులిచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. 338 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత ఓపెనర్లు అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. ఆర్యవీర్ సెహ్వాగ్ (58), కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ (80) కలిసి 95 పరుగుల పటిష్టమైన ఓపెనింగ్ భాగస్వామ్యంతో విజయానికి పునాది వేశారు. అయితే వారిద్దరూ ఔటైన తర్వాత మిడిలార్డర్ బ్యాటర్లు ఒత్తిడికి కుప్పకూలడంతో, భారత్ వెంటవెంటనే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. ఒకానొక దశలో భారత్ ఎనిమిది వికెట్లు కోల్పోయి ఉండగా, పాకిస్థాన్ తమ విజయాన్ని సంబరంగా జరుపుకోవడానికి సిద్ధమవుతోంది. గెలుపు ఇరు జట్ల మధ్య దోబూచులాడిన వేళ చివరి ఓవర్ చివరి బంతికి భారత విజయానికి అవసరమైన పరుగులను మనల్ చౌహాన్‌తో కలిసి మోహిత్ ఉల్వా అద్భుతంగా రాబట్టాడు. పాక్ పేసర్ అహ్మద్ హుస్సేన్ వేసిన 50వ ఓవర్ చివరి బంతిని బౌండరీకి తరలించిన మోహిత్ భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.



వచ్చే నెల 16న ఐపిఎల్ మినీ వేలం

ఆక్షన్‌లో ఏడుగురు బంగ్లాదేశ్ ప్లేయర్స్

న్యూఢిల్లీ: భారత్, బంగ్లాదేశ్ మధ్య క్రికెట్ సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఉన్న వివాదాలను పక్కన పెట్టి, రాబోయే ఐపీఎల్ 2027కు సంబంధించి డిసెంబరు 16న మినీ వేలం జరగనుంది. ఈ వేలంలో బంగ్లాదేశ్ ఆటగాళ్లు పాల్గొనేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. సాధారణ ప్రక్రియలో భాగంగా, త్వరలో జరగబోయే ఐపీఎల్ మినీ వేలం కోసం బీసీసీఐ వివిధ దేశాల క్రికెట్ బోర్డులను సంప్రదించింది. ఈ జాబితాలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కూడా ఉండటం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. డిసెంబర్ 16న జరగనున్న ఐపీఎల్ మినీ వేలంలో పాల్గొనేందుకు ముస్తాఫిజుర్ రెహమాన్ మళ్లీ తన పేరును రిజిస్టర్ చేసుకోవడం విశేషం. ముస్తాఫిజుర్తో పాటు, మరో ఆరుగురు బంగ్లా ప్లేయర్లు కూడా ఈ వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఆ జాబితాలో నహిద్ రాణా, రిషాద్ హుస్సేన్, హసన్ మహమూద్, తౌహిద్ హృదయ్, తస్కిన్ అహ్మద్, షోరిఫుల్ ఇస్లాం ఉన్నారని తెలుస్తోంది. కాగా గత ఏడాది డిసెంబర్లో బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరిగిన దాడుల వార్తల నేపథ్యంలో, బంగ్లా ఆటగాళ్లు ఐపీఎల్ ఆడటంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది జనవరిలో ముస్తాఫిజుర్ను విడుదల చేయాలని బీసీసీఐ సూచించగా, కేకేఆర్ అతడిని వదులుకుని రీప్లేస్మెంట్ ప్లేయర్ను తీసుకుంది. నిజానికి గత డిసెంబర్ వేలంలో రూ. 2 కోట్ల బేస్ ప్రైస్తో బరిలోకి దిగిన ముస్తాఫిజుర్ కోసం చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య గట్టి పోటీ నడిచింది. చివరకు కేకేఆర్ ఏకంగా రూ. 9.20 కోట్ల రికార్డు ధరకు అతడిని దక్కించుకుని, ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన బంగ్లాదేశ్ క్రికెటర్‌గా నిలిపింది. ముస్తాఫిజుర్ను ఐపీఎల్ నుంచి తప్పించడంపై అప్పట్లో పెద్ద వివాదమే చెలరేగింది. దీనికి నిరసనగా, భద్రతా కారణాలను చూపుతూ 2026 టీ20 వరల్డ్ కప్ కోసం తమ జట్టును భారత్‌కు పంపేందుకు బీసీబీ నిరాకరించింది. తమ మ్యాచ్లను భారత్ నుంచి సహ ఆతిథ్య దేశమైన శ్రీలంకకు మార్చాలని అంతర్జాతీయ క్రికెట్ మండలిని కోరింది. కానీ ఐసీసీ ఆ డిమాండ్‌ను తిరస్కరించడంతో బంగ్లాదేశ్ టోర్నీ నుంచి తప్పుకుంది. దీంతో బంగ్లా స్థానంలో స్కాట్లాండ్ జట్టుకు వరల్డ్ కప్‌లో ఆడే అవకాశం దక్కింది. ఇన్ని నాటకీయ పరిణామాల తర్వాత ఇప్పుడు మళ్లీ ఏడుగురు బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఐపీఎల్ వేలంలోకి రావడం క్రీడాభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది.

శాఫ్ ఛాంపియన్‌షిప్..

భూటాన్‌ను ఓడించి ఫైనల్స్‌కు భారత్

ఢాకా: శనివారం జరిగిన మ్యాచ్‌లో భూటాన్ ద్వితీయార్ధంలో పుంజుకున్నప్పటికీ, భారత్ 2-1 తేడాతో విజయం సాధించి సాఫ్ ఛాంపియన్‌షిప్-2026 ఫైనల్‌కు దూసుకెళ్లింది. భూటాన్ ప్రారంభంలో భారత్ పాసింగ్‌కు అంతరాయం కలిగించడానికి మిడ్‌ఫీల్డ్‌లో తీవ్రంగా శ్రమించింది. విష్ణు పివి 9వ నిమిషంలో చేసిన గోల్‌తో భారత్ ఆధిక్యంలోకి వచ్చింది. రెండు నిమిషాల తర్వాత అభిషేక్ సూర్యవంశీ ఇచ్చిన క్రాస్‌ను భారత్ కెప్టెన్ చింగ్లెన్సానా నెట్‌లోకి కొట్టి గోల్ చేయడంతో రెండు గోల్స్ ఆధిక్యాన్ని కొనసాగించారు. భూటాన్ మరింత పట్టుదలతో, ప్రత్యక్ష విధానంతో తిరిగి బరిలోకి దిగింది. బాక్స్‌లోకి వచ్చిన ఫ్రీకిక్‌ను భారత్ క్లియర్ చేయడంలో విఫలమవడంతో కిన్జాంగ్ తాషి టోబ్డెన్ (48వ నిమిషం) చేసిన గోల్ భూటాన్ ఆధిక్యాన్ని తగ్గించారు. యాద్వాద్ పంపిన క్రాస్ బాక్స్ లోపల నీమా వాంద్ది చేతికి తగలడంతో ఆధిక్యాన్ని తిరిగి సాధించేందుకు భారత్‌కు అవకాశం లభించింది. బంతిని ఏరియాలోకి తీసుకువెళ్లి, తన ఎడమ కాలుతో ఒక డిఫెండర్‌ను బోల్తా కొట్టించి, ఆ తర్వాత కుడి కాలుతో షాట్ కొట్టగా, ఆ ప్రయత్నం క్రాస్‌బార్‌ను తాకింది. భూటాన్ స్కోరును సమం చేసే గోల్ కోసం ప్రయత్నించింది.



గ్యెల్షెన్ ప్రత్యామ్నాయ ఆటగాడు కిన్జాంగ్ టెన్జిన్ వైపు బంతిని పంపినా అది విఫలమై భూటాన్‌కు అవకాశం చేజారడంతో భారత్ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని ఫైనల్‌లో తమ స్థానాన్ని సురక్షితం చేసుకుంది.



కుమామోటో: భారత్ షట్లర్ లక్ష్య సేన్, ఈసారి జపాన్‌లో మరో బిడబ్ల్యూఎఫ్-2026 టైటిల్‌ను కైవసం చేసుకునే దిశగా దూసుకుపోతున్నాడు. లక్ష్య ఈ సీజన్‌లో మంచి ఫామ్‌ను కొనసాగిస్తూ, శనివారం ఇక్కడ కుమామోటో ప్రిఫెక్చురల్ జిమ్నాసియంలో ఇండోనేషియాకు చెందిన అల్వి ఫర్హాన్‌ను 21-12, 15-21, 21-11 తేడాతో ఓడించాడు. భారత షట్లర్ ఒక గంట తొమ్మిది నిమిషాల వ్యవధిలో ఈ పోటీని ముగించి ఫైనల్‌కు చేరుకున్నాడు. అక్కడ అతను కోని వటనాబేతో తలపడతాడు. జపాన్ మాస్టర్స్‌లో, అతను చైనీస్ తైపీకి చెందిన చి యు జెన్‌పై 21-19, 21-18 తేడాతో విజయం సాధించి తన ప్రచారాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత రెండవ రౌండ్‌లో చైనాకు చెందిన డాంగ్ టియాన్ యావోను కేవలం 35 నిమిషాల్లో 21-8, 21-14 తేడాతో ఓడించాడు. అతను జపాన్‌కు చెందిన యుషి తనకాను 39 నిమిషాల లోపే 21-16, 21-15 తేడాతో ఓడించి సెమీఫైనల్‌లోకి ప్రవేశించాడు. అతను కొరియా ఓపెన్ నుండి వైదొలగినప్పటికీ, జపాన్‌లో అతని అద్భుత ప్రదర్శన, సీజన్ ముగింపులో జరిగే డబ్ల్యూఎఫ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించే అతని అవకాశాలను టైటిల్ సాధవైపు తీసుకెళ్లింది.

వైశాలి గెలుపు, ప్రజ్ఞా డ్రా

బుడాపెస్ట్: ఆర్. వైశాలి టోర్నమెంట్‌లో తన తొలి ఫస్ట్ క్లాసిక్ విజయాన్ని కైవసం చేసుకోగా, ప్రపంచ నంబర్ 1 అయిన మాగ్నస్ కార్ల్‌సెన్, టోర్నమెంట్‌లో ఒక పెద్ద సంచలనంగా హైక్ మార్టిరోస్యాన్ చేతిలో ఓడిపోయాడు. వైశాలి, బిబిసారా అసౌబయేవాతో జరిగిన రెండో పోరులో ఓటమి నుంచి కోలుకుని గెలిచి, ఈ టోర్నమెంట్‌లో తన తొలి ఫస్ట్ క్లాసిక్ విజయాన్ని కైవసం చేసుకుంది. అర్జున్ ఎరిగైసి కూడా వెస్లీ సోపై ఒక విజయం, ఒక డ్రాతో ప్రారంభం సాధించాడు. గ్రూప్ డిలో, అసౌబాయేవా తెల్ల పావులతో మొదట దాడి చేయగా, పావుల రంగులు తారుమారు అయినప్పుడు వైశాలి దాడి చేసి విజయం సాధించింది. ఈ విడివిడి ఫలితాల వల్ల భారత క్రీడాకారిణికి నాలుగు పాయింట్లు, కజఖ్ క్రీడాకారిణికి ఎనిమిది పాయింట్లు లభించాయి. ఇక మొదటి పోరులో సోపై ఒత్తిడికి గురైనప్పటికీ, అర్జున్ ఆటను మలుపు తిప్పి నల్ల పావులతో గెలిచాడు. రిటర్న్ మ్యాచ్ డ్రా అవ్వడంతో అతని పాయింట్లు తొమ్మిదికి చేరాయి. దీంతో అతను హన్స్ నీమాన్‌తో సమానంగా, గ్రూప్ లీడర్ మాక్సిమ్ వాచియర్‌లాగ్రావ్ కంటే మూడు పాయింట్లు వెనుకబడి ఉన్నాడు. ఫ్రెంచ్ ఆటగాడు నీమాన్‌తో తన మొదటి గేమ్‌ను డ్రా చేసుకున్నాడు, ఆ తర్వాత వైట్‌తో నిరంతర ఒత్తిడిని పెంచి 2వ గేమ్‌ను గెలిచి పన్నెండు పాయింట్లకు చేరుకున్నాడు. సో నాలుగు పాయింట్లు సాధించాడు. గ్రూప్ బిలో ఆర్. ప్రజ్ఞానంద, వ్లాడిస్లావ్ ఆర్టెమియేవ్‌తో జరిగిన రెండు గేమ్‌లను డ్రా చేసుకున్నాడు. వారి మొదటి పోరు 89 ఎత్తుల పాటు సాగింది. ప్రజ్ఞానందకు నాలుగు పాయింట్లు, ఆర్టెమియేవ్‌కు ఐదు పాయింట్లు లభించాయి.



నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్..



ముంబయి, నవంబరు 14: దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో నష్టాలతో ముగిశాయి. వరుసగా మూడు సెషన్ల పాటు లాభాల్లో కొనసాగిన సూచీలు అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు, ఇరాన్ సంఘర్షణకు సమీప భవిష్యత్తులో పరిష్కారం లభిస్తుందన్న ఆశలు సన్నగిల్లడంతో బ్రెంట్ క్రూడాయిల్ ధరలు పెరిగాయి. మరోవైపు అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడులు పెరగడం డాలర్‌కు బలాన్నిచ్చింది. దీంతో ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లను పెంచవచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగానికి సంబంధించి నెలకొన్న అనిశ్చితి కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. ఎన్విడియా సిఇఒ జెన్సన్ హువాంగ్ ఆస్మిక రాజీనామా చేసినట్లు వచ్చిన వార్తలు ఇన్వెస్టర్లలో ఆందోళనలను పెంచాయి.శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్ఇ సెన్సెక్స్ 318.56 పాయింట్లు క్షీణించి 81,592.45 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 50 సూచీ 155.05 పాయింట్లు నష్టపోయి 25,144.30 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ 25,150 స్థాయికి దిగువకు చేరింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.25 శాతం, నిఫ్టీ 1.21 శాతం చొప్పున లాభపడ్డాయి.రియల్టీ, ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎన్ఎస్ఇలో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా రియల్టీ, ఆటో, మెటల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి అధికంగా కనిపించింది. నిఫ్టీ సూచీని ప్రభావితం చేసిన ప్రధాన షేర్లలో మహీంద్రా అండ్ మహీంద్రా 1.94 శాతం, టిసిఎస్ 1.43 శాతం, లార్సెన్ అండ్ టూబ్రో 0.37 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 సూచీ 0.35 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ 0.30 శాతం చొప్పున పడిపోయాయి. ఎన్ఎస్ఇలో మొత్తం 1,445 షేర్లు లాభాల్లో ముగియగా, 2,179 షేర్లు నష్టాలను చవిచూశాయి. మరో 97 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. మార్కెట్ ధోరణి బలహీనంగా ఉండటం అమ్మకాల ఒత్తిడిని సూచించింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర డిసెంబర్ 2026 కాంట్రాక్ట్ సెటిల్‌మెంట్‌కు బ్యారెల్‌కు 54 సెంట్లు తగ్గి 95.28 డాలర్లకు చేరింది. దేశీయ కమోడిటీ మార్కెట్లో డిసెంబర్ 4, 2026 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.35 శాతం పెరిగి రూ.1,36,700 వద్ద ట్రేడయ్యాయి.బాండ్ల రాబడులు, రూపాయిపై ఒత్తిడిభారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ల రాబడి 0.73 శాతం పెరిగి 7.302 శాతానికి చేరింది. గత సెషన్‌లో ఇది 7.249 శాతంగా నమోదైంది.అంతర్జాతీయ మార్కెట్లో అమెరికా 10 యేళ్ల బాండ్ రాబడి 0.53 శాతం పెరిగి 5.129 శాతానికి చేరింది.ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడింది. గత ట్రేడింగ్ సెషన్‌లో 94.1200 వద్ద ముగిసిన రూపాయి, శుక్రవారం 94.2025 స్థాయిలో కదలాడింది. ఎస్‌టీసీ షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.వోడాఫోన్ ఐడియా షేరు 3.08 శాతం పడిపోయింది.ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేరు 3.05 శాతం నష్టపోయింది. హిటాచీ ఎనర్జీ ఇండియా కంపెనీ స్టాండలోన్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 20.5 శాతం పెరిగినట్లు ప్రకటించడంతో షేరు 10.68 శాతం దూసుకెళ్లింది. ఫేమ్ ఇండస్ట్రీస్: షేరు 9.77 శాతం ర్యాలీ తీస్తే అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా షేరు 9.07 శాతం పెరిగింది.

స్టాక్ మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడుల వెల్లువ

ఈనెల్లోనే రూ.84 వేల కోట్లకు పైగా పెట్టుబడులు!



న్యూఢిల్లీ, నవంబరు 14: భారతీయ ఈక్విటీ మార్కెట్లలో విదేశీ పెట్టుబడిదారులు మరోసారి భారీగా పెట్టుబడులతో వచ్చారు. నవంబరు నెలలో ఇప్పటివరకు భారత స్టాక్ మార్కెట్లలోకి రూ.84,291 కోట్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. గత రెండు నెలలుగా కొనసాగిన పెట్టుబడుల ఉపసంహరణకు ఇది పూర్తి భిన్నమైన పరిణామం. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి, భారతీయ కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాలు, ఆసియా మార్కెట్లలో నెలకొన్న బలహీనత వంటి అంశాలు విదేశీ పెట్టుబడులను భారత్ వైపు మళ్లిస్తున్నాయి. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ గణాంకాల ప్రకారం అక్టోబర్ నెలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ.34,843 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకోగా, సెప్టెంబర్‌లో రూ.35,861 కోట్ల నిధులను ఉపసంహరించుకున్నారు. నవంబరులో మాత్రం భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా ఎఐ రంగానికి సంబంధించిన షేర్లలో అమ్మకాలు పెరగడం విదేశీ పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా దక్షిణ కొరియా, తైవాన్ మార్కెట్ల నుంచి అక్టోబర్‌లో దాదాపు 45 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. దీంతో పెట్టుబడిదారులు భారతీయ మార్కెట్లపై ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు, భారతీయ కంపెనీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో అంచనాలకు మించిన ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నాయి. లాభదాయకత, ఆదాయ వృద్ధి విషయంలో కంపెనీలు మెరుగైన పనితీరును కనబరుస్తున్నాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ మాట్లాడుతూ అమెరికాతో పాటు దక్షిణ కొరియా, తైవాన్, జపాన్ వంటి ఎఐ రంగంపై ఆధారపడిన మార్కెట్లలో షేర్ల అమ్మకాలు పెరగడం వల్ల విదేశీ పెట్టుబడిదారుల వైఖరిలో మార్పు వచ్చింది. ఈ పరిణామాలతో అమెరికా డౌ జోన్స్, నాస్‌డాక్ సూచీలు ఇటీవల 19 నెలల్లోనే అత్యంత భారీ ఒక్కరోజు పతనాన్ని నమోదు చేశాయి. చైనా, తైవాన్, దక్షిణ కొరియా, జపాన్ వంటి ప్రధాన ఆసియా మార్కెట్లు కూడా ఎఐ రంగంలోని అమ్మకాల ఒత్తిడితో నష్టాలను చవిచూశాయి. ముఖ్యంగా టెక్నాలజీ రంగంపై అధికంగా ఆధారపడిన దక్షిణ కొరియా, తైవాన్ మార్కెట్ల నుంచి అక్టోబరులో దాదాపు 45 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు బయటకు వెళ్లాయి. ఎగుమతులు, హార్డ్‌వేర్ రంగాలపై ఆధారపడిన ఆసియా ఆర్థిక వ్యవస్థల్లో ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు భారతీయ మార్కెట్లకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయంగా లాభాల మార్జిన్లపై ఒత్తిడి కొనసాగుతున్నప్పటికీ, భారతీయ కంపెనీల ఆర్థిక ఫలితాలు మాత్రం అంచనాలకు మించి నమోదవుతున్నాయి.

రూ.900 కోట్లు స్టాక్ అవార్డులు నష్టపోతున్న జెన్సెన్ హువాంగ్



న్యూయార్క్, నవంబరు 14: టెక్ దిగ్గజం, చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సహ వ్యవస్థాపకుడు జెన్సన్ హువాంగ్ కంపెనీ నుంచి వైదొలగనున్నక్రమంలో సుమారు రూ.900 కోట్లు విలువైన అన్‌వెస్టెడ్ స్టాక్ అవార్డులను కోల్పోతుననట్లు బిజినెస్ రంగ నిపుణులు చెపుతున్నారు. ఎన్విడియా కంపెనీ ఈక్విటీ పరిహార విధానం ప్రకారం ఎగ్జిక్యూటివ్‌లు కంపెనీని వీడి వెళ్లేటప్పుడు, వారికి ఇంకా అధికారికంగా బదిలీ కాని రిస్టిక్టెడ్ స్టాక్ యూనిట్లను కోల్పోతారు. ఈ నిబంధనల ప్రకారమే, జెన్సన్ హువాంగ్ తన వద్ద ఉన్న సుమారు 3,46,000 ఆర్ఎస్‌యూలతోపాటు పనితీరు ఆధారంగా భవిష్యత్తులో లభించాల్సిన అదనపు షేర్లపై కూడా హక్కును కోల్పోనున్నారు.ప్రస్తుతం జెన్సన్ హువాంగ్ నికర సంపద సుమారు 138 బిలియన్ డాలర్ల నుంచి 144.5 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుందనిఅంచనా. ఈ లెక్కన ఆయన వదులుకుంటున్న రూ.900కోట్లు ఆయన మొత్తం సంపదలో కేవలం 0.07 నుంచి 0.08 మాత్రమే. హువాంగ్ సంపదలో దాదాపు మొత్తం ఎన్విడియా షేర్ల రూపంలోనే ఉండటంగమనార్హం. జెన్సన్ హువాంగ్ ఇప్పటికీ ఎన్విడియాలో అతిపెద్ద వ్యక్తిగత వాటాదారుగా కొనసాగుతున్నారు. ఆయనకు కంపెనీలో దాదాపు 3.5 వాటా ఉంది. దీని కింద ఆయన సుమారు 812 మిలియన్ షేర్లను కలిగి ఉండగా, వాటి విలువ సుమారు 135 బిలియన్ డాలర్లుగా ఉంది. ఆయన నిష్క్రమణ వార్తల నేపథ్యంలో కంపెనీ షేర్ల ధరలో ఒడిదొడుకులు కనిపించినప్పటికీ, ఆయన భారీ వాటాలు చెక్కుచెదరకపోవడంతో ఆయన సంపదకు పెద్దగా నష్టం వాటిల్లలేదని స్పష్టమవుతోంది.

మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం.. 36 గంటల తర్వాత రికవరీ

న్యూయార్క్: మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. మైక్రోసాఫ్ట్ 365 కింద పనిచేసే వివిధ అప్లికేషన్లు మొరాయించాయి. గురువారం సుమారు 5 గంటల పాటు ఔట్‌లుక్, టీమ్స్‌తో పాటు ఇతర కొన్ని అప్లికేషన్లు స్తంభించిపోయాయి. దీంతో వేలాది మంది మైక్రోసాఫ్ట్ 365 అప్లికేషన్ యూజర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిట్టచివరకు 36 గంటల తర్వాత అందుబాటులోకి వచ్చాయి. ఓపెన్ ఎఐతో పాటు ఆంత్రోపిక్ సేవలకు కూడా మైక్రోసాఫ్ట్ వల్ల అవరోధాలు కలిగాయి. అయితే సేవలు నిలిచిపోయిన సర్వర్లను రిస్టోర్ చేసేందుకు మైక్రోసాఫ్ట్ వర్కుచేసింది. యూజర్లు మెల్లమెల్లగా తమ సర్వీసులకు కనెక్ట్ అవుతున్నారని కంపెనీ తాజాగా తన రిపోర్టులో చెప్పింది.



డౌన్‌డిటెక్టర్ ప్రకారం ఔట్‌లుక్ సేవల్లో గురువారం మధ్యాహ్నం తీవ్ర స్థాయిలో అంతరాయం ఏర్పడినట్లు తెలిసింది. సాయంత్రానికి ఆ సమస్య తగ్గింది. మైక్రోసాఫ్ట్ 365కి సంబంధించిన ఇష్యూలు అన్నీ నిన్న సాయంత్రం వరకు గణనీయంగా తగ్గినట్లు కంపెనీ చెప్పింది. టీమ్స్‌ను యాక్సెస్ చేసేందుకు కూడా యూజర్లకు కొంత సమయం పట్టింది. సర్వర్లపై ఒకేసారి అధిక లోడు పడడం వల్ల సేవల్లో అవరోధాలు ఎదురైనట్లు మైక్రోసాఫ్ట్ చెప్పింది. మైక్రోసాఫ్ట్ 365 సర్వీసుల్లో సమస్యలు ఎదుర్కొంటున్న యూజర్ల రిపోర్టులపై దర్యాప్తు చేస్తున్నట్లు కంపెనీ పేర్కొన్నది. ప్రభావానికి గురైన సర్వర్లను మళ్లీ ఆన్‌లైన్‌లోకి తెచ్చే ఏర్పాట్లు జరుగుతున్నట్లు కంపెనీ వెల్లడించింది. కెపాసిటీని రిస్టోర్ చేశామని, యూజర్లు రికవరీ అవుతారని మైక్రోసాఫ్ట్ తన స్టేట్‌మెంట్‌లో తెలిపింది.

స్పామ్ కాల్స్, సందేశాలపై ట్రాయ్ కొరడా



న్యూఢిల్లీ, నవంబరు 14: అవాంఛిత వాణిజ్య కాల్, స్పామ్ సందేశాల నియంత్రణకు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ కఠిన చర్యలు చేపట్టింది. 2026 జూలై నుంచి సెప్టెంబరు వరకు నిబంధనలు ఉల్లంఘించిన 1.24 లక్షలకు పైగా టెలికాం వనరులపై చర్యలు తీసుకుంది. అలాగే 374 సంస్థలను యేడాది పాటు బ్లాక్‌లిస్ట్‌లో చేర్చింది. ట్రాయ్ విడుదల చేసిన 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక నివేదిక ప్రకారం తొలిసారి నిబంధనలు ఉల్లంఘించిన 1,10,325 మొబైల్ నంబర్లు సహా 15 రోజుల పాటు అవుట్‌గోయింగ్ సేవలను నిలిపివేశారు. పదేపదే ఉల్లంఘనలకు పాల్పడిన 13,777 కనెక్షన్లను ఏడాది పాటు డిస్‌కనెక్ట్ చేశారు. అంతేకాకుండా 3,725 ఎస్ఎంఎస్ హెడర్లను బ్లాక్ చేశారు. మరో 374 మంది సందేశాలు పంపే సంస్థలను యేడాది పాటు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచారు. ఈ కాలంలో ఆయా సంస్థలు కొత్త టెలికాం వనరులను పొందేందుకు వీలుండదు. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో అవాంఛిత వాణిజ్య సమాచారంపై ట్రాయ్‌కు మొత్తం 15.29 లక్షల ఫిర్యాదులు అందాయి. వీటిలో 7.23 లక్షల ఫిర్యాదులను చర్యలు తీసుకోవాల్సినవిగా గుర్తించారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా టెలికాం నెట్‌వర్క్‌ల నుంచి 714.01 బిలియన్ కాల్స్, 702.28 బిలియన్ ఎస్ఎంఎస్‌లు వెళ్లాయి. ప్రతి పది లక్షల అవుట్‌గోయింగ్ కాల్స్‌కు సుమారు 2.14 ఫిర్యాదులు నమోదైనట్లు నివేదిక వెల్లడించింది. స్పామ్ కాల్స్, సందేశాలపై ఫిర్యాదు చేసేందుకు వినియోగదారులు ట్రాయ్ డీఎన్‌డీ యాప్‌ను ఎక్కువగా ఉపయోగించారు. టెలికాం సంస్థలు వినియోగిస్తున్న ఎఐ ఆధారిత వ్యవస్థలు త్రైమాసికంలో 19.9 బిలియన్ ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్‌లను అనుమానాస్పద స్పామ్‌గా గుర్తించాయి. వీటిలో 18.28 బిలియన్ కాల్స్, 1.62 బిలియన్ ఎస్ఎంఎస్‌లు ఉన్నాయి. స్పామ్ సందేశాలు పంపుతున్నట్లు అనుమానించిన సంస్థలకు టెలికాం ఆపరేటర్లు 45.9 లక్షలకు పైగా హెచ్చర